



ఇటీవల ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌ను గుంటూరు రేంజి ఐజీ తనిఖీ చేశారు. ఆ సమయంలో కొన్ని సీడీ ఫైళ్లలో కేవలం ఎఫ్ఐఆర్ మాత్రమే ఉండటాన్ని చూసి ఆయన ప్రశ్నించారు. ఎస్పీ గ్రీవెన్స్ నుంచి వచ్చిన అర్జీలను కూడా పెండింగ్‌లో ఉంచిన విషయాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత 10 రోజులుగా జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లను ఎస్పీ దామోదర్ తనిఖీలు చేశారు. స్థానికంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిశీలిస్తూ కొన్నిచోట్ల అధికారులను మందలించారు. ఆయన ఆదేశాల మేరకు అప్పటికప్పుడు కొన్ని కేసులు నమోదు చేశారు.



పుల్లలచెరువు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన అనంతరం అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్ (ఫైల్)

గాడిన పడేనా?

ఇష్టారాజ్యంగా పోలీసులు

- కేసుల నమోదులో జాప్యం
- సరిగ్గా ఉండని సీడీ ఫైళ్లు
- గ్రీవెన్స్ అర్జీలు కూడా పెండింగ్
- పశ్చిమప్రాంతాన్ని చుట్టివచ్చిన ఎస్పీ
- ఆయన దృష్టికి అనేక సమస్యలు
- సత్వరమే కేసులు నమోదు చేయించిన వైనం
- నేడు నేర సమీక్షా సమావేశం

పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా కిందిస్థాయి అధికారుల తీరు మారడం లేదు. ఆదాయమే పరమావధిగా విధులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా సామాన్యులకు సత్వర న్యాయం అందడం లేదు. అందుకు తాజాగా ముఖ్యమంత్రి ఇచ్చిన గ్రేడింగే నిదర్శనం. ఫైళ్ల పరిష్కారంలో పోలీసు శాఖ 18వ స్థానంలో ఉంది. అదే పరిస్థితి జిల్లాలోనూ కొనసాగుతోంది. స్టేషన్లలో కేసుల నమోదు నుంచి దర్యాప్తులు, పరిష్కారాలు అన్నీ మందకొడిగానే సాగుతున్నాయి. తాజాగా ఐజీ ఆదేశాలు, ఎస్పీ తనిఖీలతోనైనా పోలీసు శాఖ గాడిన పడుతుందా.. అనేది చర్చనీయాంశంగా మారింది.

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో జవాబుదారీతనం, పారదర్శకత పెరగాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా.. కిందిస్థాయి అధికారులు మాత్రం మారడం లేదు. మేమింతే అంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారు. పాత కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లలో దర్యాప్తునకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేకపోవడం చూస్తే పోలీసు స్టేషన్లలో నిర్లక్ష్యం ఏస్థాయిలో ఉందో అర్థమవుతుంది. నాలుగురోజులపాటు జిల్లాలోని పశ్చిమప్రాంతంలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్‌లను ఎస్పీ దామోదర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనేక మంది బాధితులు ఆయన్ను కలిశారు. కొంతమంది చిన్నచిన్న విషయాలపై స్టేషన్‌కు వచ్చినా తమను పోలీసులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దొంగతనాల కేసులు నమోదు చేయకుండా తిప్పుకోవడం, సెల్‌ఫోన్, మోటర్‌సైకిల్ చోరీల విషయంలో ఇన్సూరెన్స్ ఉందా.. లేకుంటే బైక్ దొరికినప్పుడు కేసులు నమోదుచేస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైబర్ నేరాలు జరిగితే తాము చేయగలిగింది ఏముందని చేతులెత్తేస్తున్నారని ఆరోపించారు. ఇలాగైతే తమకు సత్వర న్యాయం ఎలా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్పీకి ఫిర్యాదు చేస్తే గాని అరాచకవాదికి అడ్డుకట్ట వేయలేదు

పుల్లలచెరువు మండలం సిద్దన్నపాలెంనకు చెందిన గడ్డం సుబ్బయ్య వైసీపీ నేత. గత ప్రభుత్వ హయాంలో స్థానిక మంత్రి అండదండలతో చెలరేగిపోయాడు. గ్రామంలో ఉండా లంటే రూ.10లక్షలు ఇవ్వాలని ముగ్గురు అన్నదమ్ములను బెదిరించాడు. అదేమిటని ప్రశ్నిస్తే వారిపై దాడి చేశాడు. అప్పట్లో పోలీసు స్టేషన్‌కు వెళ్లినా పట్టించుకున్న వారు లేరు. దీంతో బాధితులు ఊరు విడిచి వెళ్లిపోయారు. అంతేకాదు సిద్దన్నపాలెం గ్రామాన్ని తన పేరు మీద ఆన్‌లైన్ చేసుకొని బ్యాంక్‌లో తాకట్టుపెట్టాడు. ఇలాంటి ఘనచరిత్ర కలిగిన సుబ్బయ్యపై పలుమార్లు ఫిర్యాదులు

మిగతా 6వ పేజీలో

బాధితులపైనే కేసు నమోదు

ఒంగోలు నగరంలోని కేశవరాజుకుంటలో ఓ బాలికను కొందరు వేధింపులకు గురిచేశారు. వారిపై బాలిక తల్లి, అన్న తాలూకా పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. టూటౌన్ పోలీసు స్టేషన్ తనిఖీకి వచ్చిన గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీని బాధితులు కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. అదేసమయంలో బాధితురాలు తల్లి, అన్నతోపాటు దళిత నాయకులపై ఆ కేసులో నిందితులుగా ఉన్న వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేయడం చర్చనీయాంశమైంది.

వినతులలో 6వ స్థానం

- జిల్లాలో అందినవి 36,282.. సీఎంకు చేరినవి 764
- కార్యదర్శుల భేటీలో ప్రకటించిన ప్రభుత్వం
- నమ్మకం ఉన్నచోట అధికంగా వస్తాయన్న చంద్రబాబు

ఒంగోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ అధికార యంత్రాంగానికి వినతులు అందించడంలో జిల్లా రాష్ట్రంలో ఆరో స్థానంలో ఉంది. అలాగే సీఎం కార్యాలయానికి కూడా ఆయా జిల్లాల నుంచి అందుతున్న వినతుల్లోనూ అదేస్థానంలో నిలిచింది. ఆ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో మంగళవారం అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన ప్రభుత్వ శాఖల కార్యదర్శుల సమావేశంలో ప్రకటించారు. ప్రజా విజ్ఞప్తుల రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)పై ప్రత్యేక సమీక్ష జరిగింది. అత్యధికంగా వినతులు శ్రీకాకుళం నుంచి రాగా పల్నాడు జిల్లా నుంచి తక్కువగా ఉన్నాయి.


'మీకోసం'లో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా (ఫైల్)

అయితే ప్రభుత్వంపైనా, జిల్లాల్లో పనిచేసే యంత్రాంగంపైనా తమ సమస్యలు పరిష్కరిస్తారని ప్రజల్లో ఎక్కడ విశ్వాసం ఎక్కువగా ఉంటుందో అక్కడ అధికంగా వినతులు వస్తుంటాయని ఆ సమావేశంలో సీఎం చెప్పారు. వినతుల పరిష్కారానికి మరింత వేగంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారంవారం మన జిల్లాలో వివిధ స్థాయిల్లో నిర్వహించే గ్రీవెన్స్‌ల్లోనూ, అలాగే రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 36,284 అర్జీలు అధికారులకు అందాయి. వాటిలో భూసంబంధ అంశాలే అధికంగా ఉన్నట్లు సమాచారం. అలాగే జిల్లా నుంచి ముఖ్యమంత్రి కార్యాలయానికి 764 వినతులు అందాయి. అందులోనూ జిల్లా ఆరవ స్థానంలోనే ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా జిల్లాలో వివిధ స్థాయిల్లో అందిన మొత్తం 36,284 వినతులలో ఒక కుటుంబం నుంచి ఒక అర్జీ మాత్రమే అందినవి 23,314 ఉన్నాయి. 4,108 కుటుంబాల నుంచి రెండు లేదా మూడు, 346 కుటుంబాల నుంచి నాలుగు లేదా ఐదు... 140 కుటుంబాల నుంచి 6 నుంచి 10 అర్జీలు అందినట్లు సమాచారం.

అసంపూర్తి రోడ్లకు మోక్షం..!

వివరాలు మెయిన్‌లో..

- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..'తో సమస్యకు పరిష్కారం
- 37వ డివిజన్‌లో పనులను ప్రారంభించిన కార్పొరేషన్ అధికారులు


ఒంగోలు 37వ డివిజన్‌లో సిమెంట్ రోడ్డు పనులు చేస్తున్న కార్మికులు

బాలల ఆధార్‌పై నిర్లక్ష్యాన్ని సహించను

- కలెక్టర్ అన్సారియా హెచ్చరిక
- పనితీరు బాగాలేని సీడీపీవోలు, సూపర్ వైజర్లకు షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం



ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరేళ్లలోపు బాలలకు ఆధార్ కార్డుల జారీ కోసం ప్రత్యేక శిబిరాల నిర్వహణలో జాప్యం చేస్తే సహించబోనని, కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధార్ కార్డులేని పిల్లలకు వాటిని తక్షణమే జారీ చేసేందుకు నిర్వహిస్తున్న శిబిరాలపై దిశానిర్దేశం చేశారు. పనితీరు అధ్వానంగా ఉన్న సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఐసీడీఎస్ పీడీ హెనా సుజన్‌ను ఆదేశించారు. నెట్‌వర్క్ సరిగా రావడం లేదని, గిరిజన ప్రాంతమని, మిషన్ పనిచేయడం లేదని సాకులు చెప్తూ ఇతర శాఖలపై నెపం మోపేలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితులు ఉన్నచోట్ల కూడా కొందరు సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందన్నారు. సాకులు చెప్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఆధార్ శిబిరాల నిర్వహణ ప్రధాన బాధ్యత ఐసీడీఎస్ అధికారులదేనని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, పోస్టల్ అధికారుల సహకారం తీసుకొని సమన్వయంతో ఈ శిబిరాలను నిర్వహించాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్న వారికి తక్షణమే ఆధార్ కార్డుల జారీ కోసం వివరాలు నమోదు చేయాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి తొలుత వాటిని మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోజువారీ నివేదికలను అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

విజయ్‌పాల్‌కు బెయిల్

- షరతులతో మంజూరు చేసిన కోర్టు
- తులసిబాబు పిటిషన్‌పై తీర్పు రిజర్వు
- ఆయన్ను నేడు ఒకరోజు కస్టడీకి తీసుకోనున్న పోలీసులు మెయిన్‌లో..

వెలుగు పీడీగా నారాయణ

ఒంగోలు (రూరల్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ, వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.నారాయణ నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పీడీగా పనిచేసిన వసుంధర కొద్ది నెలల క్రితం బదిలీపై ఇతర జిల్లాకు వెళ్లారు. అనంతరం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ ఇన్‌చార్జి బాధ్యతల్లో కొనసాగారు. ఆయన కూడా బదిలీ కావడంతో ప్రభుత్వం రాష్ట్ర సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న నారాయణను నియమించింది. ఆయన త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

జీజీహెచ్‌లో మెరుగైన సేవలు

- వైద్యులు సమన్వయంతో పనిచేయాలి
- సూపరింటెండెంట్ డాక్టర్ జమున

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లోని అత్యవసర వైద్యసేవల విభాగంలో లోపాలను గుర్తించామని, వాటిని సరిదిద్దడంతోపాటు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ టి.జమున తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ఆర్ఎంవోతో ఆమె సమీక్ష నిర్వహించారు. క్యాజువాలిటీ వైద్యసేవలపై 'జీజీహెచ్‌కు జబ్బు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. వైద్యాధికారులతో సమావేశంలో పలు సూచనలు చేశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సేవల్లో ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులు రాకూడదన్నారు. ఇకపై క్యాజువాలిటీలో విధులు నిర్వర్తించే డాక్టర్లు, స్పెషలిస్ట్‌లు, నర్సింగ్, ఇతర సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. అలాగే వారికి నిర్దేశించిన సమయంలో పూర్తిస్థాయిలో విధుల్లో ఉండాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు వివరించారు.

ఎవరిపై వేటు పడుతుందో.!

డ్వామా ఉద్యోగుల్లో అలజడి



ఒంగోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా)లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో కనిపిస్తున్నారు. ఎవరిపై వేటు పడుతుందోనని అధిక శాతం మంది ఉద్యోగులు, క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది వణికిపోతున్నారు. డ్వామా పీడీగా కె.శీనారెడ్డి పనిచేసిన కాలంలో భారీగా అవినీతి, అక్రమాలు, అవకతవకలు చోటుచేసుకున్నాయని నిర్ధారించి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి సిఫార్సు చేసిన విషయం విదితమే. అలాగే 70మందికిపైగా డ్వామా ఉద్యోగులపై చర్యలకు ప్రస్తుత పీడీని ఆదేశిస్తూ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై అందరిలోనూ విస్తృతంగా చర్చ సాగుతోంది. శీనారెడ్డి అండ చూసుకొని చెలరేగిపోయిన వారిపై వేటు తప్పదన్న భావన అధిక శాతం మంది వ్యక్తం చేస్తున్నారు. ఎవరెవరిపై చర్యలు ఉంటాయన్న దానిపై చర్చ నడుస్తోంది. కలెక్టర్ ఆదేశాలతో బాధ్యులపై చర్యలకు డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ చర్యలు తీసుకోవాల్సి ఉంది. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు పరిశీలించి తదనుగుణంగా ఫైళ్లు తయారు చేసి చర్యలు తీసుకునేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. తమకు వేటు తప్పదన్న ఆందోళన ఉన్న కొందరు ఉద్యోగులు తప్పించుకునేందుకు మార్గాలు అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది.

గాడిన పడేనా?

(5వ పేజీ తరువాయి)

చేసినా పోలీసులు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం ఎస్పీ పోలీసు స్టేషన్ తనిఖీకి వచ్చినప్పుడు బాధితులు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి వైసీపీ నేతను అరెస్టు చేశారు.

కేసుల నమోదులో జాప్యం

న్యాయం జరుగుతుందని ఎంతో ఆశతో పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితుల గోడు వినేందుకు, సత్వరమే స్పందించేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా దొంగతనాలకు సంబంధించిన కేసులు నమోదు చేయడం లేదు. సెల్‌ఫోన్ పోయింది అని వస్తే దొరికినప్పుడు ఇస్తామని చెప్పి పంపిస్తున్నారు. మోటర్ సైకిల్ చోరీకి గురైందని పోలీసు స్టేషన్‌కు వెళ్లినా ప్రయోజనం ఉండటం లేదు. ఎక్కడైనా దొరికితే చూద్దాంలే అని చెబుతున్నారు. కొన్ని కేసులలో స్థానిక నాయకుల నుంచి వచ్చే సమాచారం కోసం పోలీసులు వేచిచూస్తున్న పరిస్థితి.

సిట్ కేసులలో దర్యాప్తు నత్తనడక

జిల్లాలో భూవివాదాలపై వేసిన సిట్‌లో నమోదైన కేసుల దర్యాప్తు ముందుకు సాగడం లేదు. కొన్ని కేసులలో అసలు విచారణ చేయడం లేదు. కేవలం ఎఫ్ఐఆర్ మాత్రమే కట్టి వదిలి వేశారు. భూవివాదాలు ఏమాత్రం పరిష్కారం కాకుండా ఉండటంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు దాటినా కేసుల విషయాన్ని సిట్ పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ కేసులు దర్యాప్తు ముమ్మరం చేసి భరోసా కల్పించాలని వారు కోరుతున్నారు.

ఐటీ కోర్ సీఐపైనే కేసు నమోదు

ప్రస్తుతం జిల్లాలో ఐటీ కోర్‌లో సీఐగా పనిచేస్తున్న సూర్యనారాయణపై పల్నాడు జిల్లాలో కేసు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో చిలకలూరిపేట సీఐగా పని చేశారు. అప్పటి మంత్రి విడదల రజని ఏమి చెబితే అది చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. సోషల్ మీడియాలో రజనిపై పోస్టింగ్‌లు పెట్టినట్లు తనపై సూర్యనారాయణ నేరం మోపి అక్రమంగా నిర్బంధించి కొన్నిరోజులపాటు వేధింపులకు గురిచేశారని ఓ దళిత యువకుడు ఫిర్యాదు చేయడంతో రజనితోపాటు సీఐపై కూడా కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నేడు నేర సమీక్షా సమావేశం

జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీ నేర సమీక్ష చేయనున్నారు. జిల్లాలోని పోలీసు అధికారులంతా హాజరుకానున్నారు.ఈ సమావేశంలో పెండింగ్ కేసులపై సమీక్ష చేస్తారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష చేయనున్నారు.

గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని పీఎల్‌పీ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పిన్నిక లక్ష్మీప్రసాద్ అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గ్యాస్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సేఫ్టీ క్లినిక్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గ్యాస్ స్టవ్‌ను లైటర్‌తో వెలిగించాలని, రెగ్యులేటర్‌ను సరిగ్గా బిగించాలన్నారు. రాత్రిపూట రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. గ్యాస్ స్టవ్ పనితీరు గమనించుకుని సమీపంలోని కంపెనీ నుంచి సూచనలు, సలహాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు తాగునీటిని అందిస్తున్న మినరల్ వాటర్ ప్లాంటులలో ట్యాంక్‌లను, అలాగే ఇంటింటికీ తిరిగి ఆటోలలో నీటిని సరఫరా చేసే ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించే ఏర్పాట్లు చేయించాలని బీజేపీ నాయకులు మున్సిపల్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అటు ప్లాంటులలో, ఇటు ఇళ్ల వద్దకు వచ్చే ట్యాంక్‌లను చాలామంది యజమానులు నెలల తరబడి శుభ్రం చేయడం లేదని, దాని వలన అనారోగ్యం పాలు అవుతున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు ఎ.ఉదయ్‌శంకర్, నాయకులు బి.వి.రామాంజనేయులు, షేక్ ఖాదర్‌వలి, కె.చంద్రమోహన్, దప్పిలి వినోద్‌రెడ్డి ఉన్నారు.

రీసర్వేను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ అన్సారియా



రీసర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

కొత్తపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. కొత్తపట్నం మండలం గాదెపాలెం గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామంలో 124 మంది రైతులకు చెందిన సుమారు650 ఎకరాల భూములను రీసర్వే చేశామని, గ్రామ సరిహద్దులు చేశామని, 50 శాతం సర్వే పూర్తి చేసినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ భూములు రీసర్వే ద్వారా భూములు మ్యుటేషన్‌లను ఉల్లంఘించవచ్చని ఆదేశించారు. అనంతరం ఆర్డీవో లక్ష్మీప్రసన్నతో ఇద్దరు రైతులకు ఫోన్ చేయించి వారి నుంచి సమాచారం తెలుసుకున్నారు. అక్కడకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో రీసర్వే సహాయ సంచాలకులు గౌస్‌బాషా, తహసీల్దార్ మధుసూదనరావు, సర్వేయర్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంకుడు గుంతల నిర్మాణాలు లక్ష్యాల మేరకు చేపట్టేందుకు దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా ఈనెల 15న జిల్లావ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో 15వేల ఇంకుడు గుంతలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకరమైన వ్యర్థాలను ఇంటి వద్దే వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు, పోషకాహార లోపాలను నివారించేందుకు బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా రూపొందించిన సర్వేను వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు, మహిళా సంరక్షణ కార్యదర్శులు సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు జోసఫ్‌కుమార్, గొట్టిపాటి వెంకటనాయుడు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

బల్లికురవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపీడీవో కె.కుసుమకుమారి బుధవారం పరిశీలించారు. గ్రామానికి పరమడ వైపున ప్రభుత్వ భూమిలో చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని గ్రామ పెద్దలు ఎంపీడీవోకి తెలియజేశారు. దీనిపై అమె స్థలాన్ని పరిశీలించి త్వరలో చెత్త సంపద కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు.

పొందూరు రైతుల పాట్లు

● చోరీకి గురైన 'ఎత్తిపోతల' సామగ్రి ● పట్టించుకోని అధికారులు ● సొంతంగా మరమ్మతులు ● పంటలపై ఆందోళన



ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేసుకుంటున్న పొందూరు రైతులు

టంగుటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందూరు ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకవైపు పథకానికి సొంత డబ్బులతో మరమ్మతులు చేసుకుంటూనే మరోవైపు పంటలను కాపాడుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ఎత్తిపోతలకు సంబంధించిన కొన్ని ప్రధాన పరికరాలు కొంతకాలం క్రితం చోరీకి గురయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి తీగను దొంగలు అపహరించుకెళ్లారు. దీనిపై సంబంధిత శాఖల అధికారుల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో సొంత డబ్బులతో మరమ్మతులకు ఉపక్రమించారు. ఇప్పటివరకు సుమారు రూ.5లక్షల విలువైన పరికరాలను రైతులు కొనుగోలు చేశారు. ఒక గొట్టాం మరమ్మతు చేయాలంటే రోజుకు రూ.10వేలు వెచ్చించాల్సి వస్తోంది. ఇంత చేసినా పంటలకు నీరందకపోవడంతో అవి చేతికి వస్తాయన్న నమ్మకం లేదు. అదేసమయంలో ఇటీవల పొగాకు బోర్డు అధికారులు రైతులతో సమావేశమై ఈ సీజన్‌లో ఆశించిన స్థాయిలో ధరలు లభించకపోవచ్చని స్పష్టం చేశారు. దీంతో ఆయకట్టులోని 1,050 ఎకరాల్లో పొగాకు సాగు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. మరో 400 ఎకరాల్లో శనగ వేసిన రైతులు పరిస్థితి కూడా అలాగే ఉంది.



సాగర హారతిని ఇస్తున్న పురోహితుడు

భక్తిశ్రద్ధలతో సాగరహారతి

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సముద్ర తీరంలోని ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో బుధవారం రాత్రి హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సాగర హారతిని ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజ్, జ్వాలా నరసింహం, వేద పండితులు కార్తీక్ శర్మ, నగేష్, సంఘ్ రాష్ట్ర నాయకులు అవ్వారు శ్రీనివాసరావు, ఆంజనేయశర్మ, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు
రిసార్ట్స్ నిర్వహించాలి

● డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు మాత్రమే రిసార్ట్స్ నిర్వహించాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. బుధవారం సముద్ర తీరంలోని రిసార్ట్స్ యజమానులు, నిర్వాహకులతో రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కచ్చితంగా గజ ఈతగాళ్లతో నిర్వహణ సాగాలన్నారు. ప్రమాదాలు నియంత్రించాలంటే గజ ఈతగాళ్ల సాయం అవసరం ఉందన్నారు. అలాగే అనుమతులు లేకుండా క్యాంప్ ఫైర్ వంటివి నిర్వహించరాదన్నారు. రూములకు వచ్చిన వారి నుంచి అడ్రస్ ప్రూఫ్‌లు తప్పనిసరిగా సేకరించాలన్నారు.

రైస్ డిపోలపై దాడులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అధికారులు రెండో రోజు రైస్ డిపోలపై దాడులు నిర్వహించారు. ఈక్రమంలో తహసీల్దార్ పార్వతి, సివిల్ సప్లయిస్ డీటీ గీత 13, 15 షాపులను తనిఖీ చేశారు. స్టాకు సక్రమంగా ఉన్నట్లు చెప్పారు. తరచూ దాడులు జరుగుతాయని, భిన్నంగా వ్యవహరిస్తే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.

రేపు ఉచిత నేత్రవైద్య శిబిరం

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ గ్రామంలో ఈ నెల14న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేత కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గొట్టిపాటి యూ త్ ఆధ్వర్యంలో కారంచేడు ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షకు వచ్చే వారు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. శుక్రవారం ఉదయం వైద్య శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రత్యేక పూజల్లో మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి వేణుగోపాల స్వామి దేవస్థానంలో పొగడదండ రవికుమార్ దంపతులచే శాంతి కల్యాణ హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ హాజరయ్యారు. ఈక్రమంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి మహేంద్రనాథ్‌కు ఆశీస్సులు అందించారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పంచుమర్తి రాంబాబు బీరువాను బహూకరించారు. ఇదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పంచుమర్తి రాంబాబు కుమార్తె భవ్యశ్రీ పోస్టర్ కాంపిటేషన్‌లో దేశ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి గ్రామానికి, పాఠశాలకు పేరు తెచ్చింది. భవ్యశ్రీ తండ్రి రాంబాబు బుధవారం బీరువాను హెచ్‌ఎం అణితకు అందచేశారు. రాంబాబును ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

సంతమాగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విత్తన వ్యాపారం సాగక, అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొమ్మలపాడు గ్రామం వద్ద బుధవారం చోటుచేసుకుంది. అద్దంకి పట్టణం పసుమర్తి పాలెంకు చెందిన సిద్ధారపు సుబ్బారెడ్డి (50) అద్దంకి టౌన్‌లో విత్తనాల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం సాగక, అప్పులు ఎక్కువై మనస్థాపం చెంది, అద్దంకి నుంచి కొమ్మలపాడు గ్రామం కాలువ వద్దకు వచ్చి కూల్ డ్రింక్ బాటిల్‌లో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడు సిద్ధారపు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినియోగంలోకి గుంటుపల్లి ఎత్తిపోతల

- మంత్రి రవికుమార్ ఆదేశాలతో చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న మూడు గ్రామాల రైతులు

బల్లికురవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత రెండేళ్ల నుంచి మరమ్మతులకు గురై ఉన్న గుంటుపల్లి ఎత్తిపోతల పథకం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో ఎట్టకేలకు బుధవారం నుంచి వినియెగంలోకి వచ్చింది. రెండేళ్లగా నిరుపయెగంగా ఎత్తిపోతల పథకం ఉండడంతో పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. దీంతో ఇటీవల నీటి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్యను ఎత్తిపోతల పథకాన్ని వినియెగంలోకి తీసుకురావాలని రైతులు కోరారు. దీంతో అయన ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించగా అందులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయి ఉంది. మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ విషయాన్ని పేరయ్య మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పథకంలో మరమ్మతులు చేసి నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. ఎంతో కాలంగా పనిచేయని ఎత్తి పోతల పథకం కూటమి ప్రభుత్వం రాగానే వినియెగంలోకి తీసుకు రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ గ్రామాలలో ఉన్న 12 వందల ఎకరాల భూములను నీరు అందుతుందని మొక్కజొన్నను రైతులు సాగు చేసి ఉన్నారని ఇప్పుడు పథకం వినియెగంలోకి రావడం పంటలకు ఉపయోగమని రైతులు అంటున్నారు.



మరమమ్మతుల అనంతరం వినియోగంలోకి వచ్చిన గుంటుపల్లి ఎత్తిపోతల పథకం



కాలువలోకి వచ్చి చేరుతున్న ఎత్తిపోతల నీరు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

16న జాతీయ స్థాయి
ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

హాజరు కానున్న మంత్రి రవికుమార్, సినీనటుడు సుమన్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌బీ డ్రాగన్స్ షటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన స్థానిక గీతామందిర్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ కరాటే కుంగ్‌ఫు, టైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని పోటీల చీఫ్ ఆర్గనైజర్ పీ రాంబాబు తెలిపారు. బుధవారం స్థానిక చిన్ని మురళీ కృష్ణ ఆఫీస్‌లో పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతు ఈ పోటీలకు 8 రాష్ట్రాల నుంచి సుమారు 700 మంది పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సినీ హీరో సుమన్ హాజరవుతారని తెలిపారు. అసోసియేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జి.సాయిరాం ఇతర అధికారుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అద్దంకిలో 40 సంవత్సరాల కిందట కరాటే మాస్టర్‌గా ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు జాతీయ స్థాయి చీఫ్ ఆర్గనైజర్ స్థాయికి చేరి, ప్రస్తుతం తన స్వస్థలం అద్దంకిలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అని కరాటే రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని మురళికృష్ణ అన్నారు. ఈ పోటీలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కరాటే మాస్టర్ వెంకటరత్నం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

ఉచితంగా గుండెపోటు నివారణ ఇంజక్షన్



గుండెపోటు నివారణ ఇంజక్షన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శరత్‌కుమార్, వైద్యాధికారులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వైద్యశాలలో మెరుగైన సేవలు అందించడంలో భాగంగా వేల రూపాయలు విలువ చేసే గుండె పోటు నివారణ ఇంజక్షన్‌ను ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందిస్తుందని దానిని రోగులు సద్వినియోగపర్చుకోవాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.శరత్‌కుమార్ అన్నారు. బుధవారం అద్దంకి సీహెచ్‌సీలో గుండెపోటు నివారణ ఇంజక్షన్‌కు సంబంధించి స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండెపోటు వచ్చే లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శరత్‌కుమార్ వివరించారు. ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. మొదటి గంట అత్యంత కీలకమని, ఇలాంటి లక్షణాలు ఉన్న వారిని 108 అంబులెన్స్ సాయంతో మొదటి గంటలోపు దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తిసుకురావడం, ప్రథమిక పరీక్షల అనంతరం రూ.45వేల విలువైన ఈ ఇంజక్షన్‌ను రోగికి అందించి ప్రాణాలు కాపాడుకోవడం జరుగుతుందన్నారు.

వాహనాలను అతివేగంగా నడిపితే చర్యలు

ఆర్టీవో రామకృష్ణారెడ్డి

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు అతివేంగా పాఠశాలల సమీపంలో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు కథనంపై ఆయన స్పందించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు పాఠశాలల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అలాగే వాహన దారులకు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలాగే కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట తనిఖీ అధికారులు అంకమ్మరావు, కిషోర్‌బాబు, రవి నాయక్, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలిసిన బులియన్ మర్చంట్ ప్రతినిధులు

అదుపులో ఉన్న వ్యాపారికి తాత్కాలిక ఊరట

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం చీరాల బంగారపు వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయమై చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎస్పీ తుషార్‌డూడీని కలిశారు. ఈక్రమంలో తమ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విషయాన్ని వివరించారు. దీంతో స్పందించిన ఎస్పీ స్థానిక అధికారులతో విషయంపై ఆరా తీశారు. ఈక్రమంలో బంగారం వ్యాపారి దేవకర్ శ్రీరంగవేట్‌కు తాత్కాలిక ఊరట లభించింది. అయితే సుమారు 14 కేసుల్లోని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసుల విచారణ జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆ కేసుల వెనుక ప్రముఖులను విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది.

లక్షలు వ్యయం.. అన్నీ నిరుపయోగం

- చీరాల నియోజకవర్గంలో పెద్దఎత్తున నిలిచిన ప్రభుత్వ భవనాలు
- బిల్లులు రాక కొన్ని, ప్రారంభంకాక ఇంకొన్ని
- సేవలు లేక మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- అందుబాటులోకి తేవాలని ప్రజల విజ్ఞప్తి



బిల్లులు రాక స్వల్ప పెండింగ్‌లతో నిలిచిన బోయినవారిపాలెం రైతు సేవా కేంద్రం,





వినియోగంలో లేని దేవాంగపురి-2 సచివాలయం, దేవాంగపురి రైతు సేవా కేంద్రం

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అరకొర నిర్మాణాల పెండింగ్‌తో కొన్ని, ప్రారంభానికి నోచుకోక కొన్ని ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అత్యవసర సేవలంటూ, ప్రజల వద్దకే పాలనంటూ ఊదరగొట్టే ప్రచారాలతో గత ప్రభుత్వం ప్రజా సొమ్మును ఇష్టారీతిగా దుర్వినియోగం చేసింది. ఈక్రమంలోనే కాంట్రాక్టర్‌లకు భవనాల ఆశచూపి పనులు ప్రారంభించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో శ్రద్ధ కనబరచలేదు. అయితే వైసీపీ పాలకుల కల్లబొల్లి మాటలు నిజమని నమ్మిన కాంట్రాక్టర్‌లు వడ్డీలకు అప్పులు తెచ్చిమరీ భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. ఈక్రమంలో కొందరయితే బేస్‌మెంట్ లెవల్లోనే చేతులు దులుపుకోగా, మరి కొందరు దాదాపుగా భవనాలనుపూర్తి చేశారు. అయితే అప్పట్లో కొందరికి బిల్లులు రాకపోవడంతో అధికారులకు తాళాలు ఇవ్వలేదు. మరి కొందరికి 5దశల్లో బిల్లులు రావాల్సి ఉండగా, రెండు దశల్లోనే ఆగిపోయాయి. దీంతో దాదాపుగా పూర్తయిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. చుట్టూ చిల్లచెట్లు, పిచ్చి మొక్కలతో అస్థవ్యస్థంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల భవనాలు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసాలుగా మారాయి. భవనాల చుట్టూ చెత్తా చెదారాలు వివిధ రకాల వ్యర్థాలతో దారుణంగా కన్పిస్తున్నాయి. మరోవైపు కాంట్రాక్టర్‌లకు వడ్డీలు పెరిగి పోయి, బిల్లులు రాకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

టీడీపీ కూటమి ప్రభుత్వమైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కాంట్రాక్టర్‌లు వేడుకొంటుండగా, భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.




వాలిన స్తంభాలు.. పట్టించుకోని అధికారులు!

పూర్తిగా వాలిపోయాయి ఏ క్షణానైనా నేలకొరిగేలా ఉన్న ఈ విద్యుత్ స్తంభాలు కొప్పోలు నుంచి అల్లూరు వెళ్లే దారిలోవి. కొప్పోలు నుంచి గుత్తికొండవారిపాలెం వెళ్లే రోడ్డులోనూ ఇదే తీరులో స్తంభాలు వరిగిపోయాయి. వీటి సమీపంలో రొయ్యల చెరువులున్నాయి. రైతులు నిత్యం తిరుగుతుంటారు. ఒక స్తంభం పడిపోయినా మిగిలిన స్తంభాలు వరుసగా నేలకొరిగేలా ఉన్నాయి. ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉంది. చాలా కాలం నుంచి ఇలానే ఉన్నా విద్యుత్ అధికారులు మరమ్మతులు చేయకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - ఒంగోలు (రూరల్), ఆంధ్రజ్యోతి



వైభవంగా త్రిపురాంతకేశ్వరాలయ గిరి ప్రదక్షిణ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు విశ్వన్నారాయణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పువైపు మెట్ల నుంచి ప్రదక్షిణ ప్రారంభించారు. మంగళవాయిద్యాల నడుమ ఓం నమఃశివాయ నామ మంత్రాన్ని జపిస్తూ కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి



కృష్ణమూర్తికి తన సొంత డబ్బులు పింఛన్‌గా ఇస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

కంభం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. బుధవారం కంభం ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాలులో ఎమ్మెల్యే అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు సమస్యలు పరిష్కరించాలని అర్జీలను అందజేశారు. దర్బార్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు అయ్యిందని, నిరంతరం ప్రభుత్వం ప్రజల మధ్యే ఉందని అన్నారు. ప్రజదర్బార్‌లో ఎక్కువగా రెవెన్యూ సమస్యలు వస్తున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅవకతవకల వలన ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రంలో ప్రజాసంక్షేమం కోసం సమస్యలను పరిష్కరించాలని సూచించారన్నారు. అందులో భాగంగా కంభంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేశామని, ప్రజలు ఇచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తామని అన్నారు.

పింఛన్ వచ్చేదాకా నేనే డబ్బులిస్తా : ఎమ్మెల్యే ముత్తుముల

ప్రజా దర్బార్‌లో అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారిలో ఆర్.కృష్ణమూర్తి(70) వృద్ధుడు ఎమ్మెల్యేను కలిసి 'నాకు ఎవరూ లేరు. ఇప్పటివరకు ఎటువంటి పింఛన్ ఇవ్వడం లేదని, నాకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని' వేడుకున్నాడు. స్పందించిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అధికారులతో మాట్లాడి నీకు పింఛన్ మంజూరయ్యే వరకు ప్రతినెలా రూ. 4వేలు నా సొంత డబ్బులు ఇస్తానని హామీ ఇవ్వడమే కాక అప్పటికప్పుడు రూ. 4వేలు అందజేశారు. పఠాన్ ముబీనా అనే మహిళ 12 సంవత్సరాల పక్షవాతం కుమారుడిని ఎత్తుకుని వచ్చి 'కదలేడు, పని చేయలేడు, కానీ రూ. 6వేలు ఫించన్ ఇస్తున్నారు. రూ.15వేలు ఫించన్ వచ్చేలా చేయాలని' వేడుకోగా స్పందించిన ఎమ్మెల్యే ఎంపీడీవో, తహసీల్దార్‌తో మాట్లాడి మంచానికే పరిమితమైన ఈ బాలుడికి రూ. 15వేల పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్, పింఛన్లు వంటి వాటిపై 300కుపైగా అర్జీలు ఇచ్చారు. ఆయా శాఖల అధికారులను సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, మండలపార్టీ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో వీరభద్రాచారి, బీజేపీ మండల అధ్యక్షులు బాదం కిశోర్, ఎస్ఆర్ఐ సయ్యద్ రఫి, టీడీపీ నాయకులు కేతం శ్రీనివాసులు, జనసేన పార్టీ అధ్యక్షులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): లారీ అజాగ్రత్తగా నడిపి ఇద్దరి మృతికి కారణమైన డ్రైవర్ పత్తిపాటి ఆదినారాయణకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమాన విధిస్తూ ఎక్సైజ్ కోర్టు జడ్జి ఎస్.కోమలివల్లి బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నాగులుప్పలపాడు సమీపంలోని పోతవరం కుంట వద్ద 2019 ఫిబ్రవరి 12న డ్రైవర్ ఆదినారాయణ లారీని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపుతూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టాడు. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న అమ్మనబ్రోలుకు చెందిన పాలపర్తి సుభాషిణి(60), ఇండ్లా రమణమ్మ (57) మరణించగా, మరికొంత మందికి గాయలయ్యాయి. అప్పటి నాగులుప్పలపాడు ఎస్ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి కోర్టులో అభియోగ పత్రాలు దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టులో విచారణ జరిపారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. నిందితుడు ఆదినారాయణపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. కేసులో సమర్థవతంగా సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి సమర్థవతంగా పనిచేసిన ఎస్ఐ ప్రసాద్‌ను ఎస్పీ దామోదర్ అభినందిచారు.



వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● ఆస్పత్రులలో సుహృద్భావ వాతావరణం కల్పించాలి

● జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను లక్ష్యాలకు అనుగుణంగా పూర్తిచేయాలి ● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వైద్యశాలలకు వచ్చే ప్రజలతో సుహృద్భావ వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం జిల్లాలో పనిచేస్తున్న వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అమలు జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. మాతృ, శిశు మరణాలను తగ్గించేందుకు గర్భిణుల వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో జరిగిన ప్రసవాల వివరాలను ఎన్టీఆర్ వైద్య సేవ పోర్టర్‌లో నమోదు చేయాలన్నారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులు వీహెచ్‌ఆర్, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై వైద్యాధికారులు, సంబంధిత ప్రోగ్రామ్ అధికారులతో సమీక్షించాలన్నారు. ఎక్కడైనా లక్ష్యాలు చేరుకోకపోతే అటువంటి వైద్యాధికారులకు దిశానిర్దేశం చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మాతశిశు వైద్య సేవలు క్రమంగా అందించని వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి స్క్రీనింగ్, ఫోర్‌డీ పరీక్షలు నిర్వహించాలన్నారు. వారిలో ఏమైనా లోపాలు గుర్తిస్తే వైద్యసేవలకు రిఫర్ చేయాలన్నారు. 'ఏ తల్లి జన్మనిస్తూ మరణించకూడదు - ఏ బిడ్డ జన్మిస్తూ మరణించకూడదు' అనే నినాదంతో ఆరోగ్యశాఖ అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైద్యశాఖ వైద్యాధికారులు, సిబ్బందికి ప్రభుత్వం కేటాయించిన జాబ్‌చార్టు ప్రకారం విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల సర్వేపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ సతీష్, డీఐవో డాక్టర్ పద్మజ, డాక్టర్ భగీరథి పాల్గొన్నారు.

బైకును కారు ఢీకొని ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ముందువెళ్తున్న మోటారు బైకును వెనుక వస్తున్న కారు ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిపాలెం - వలేటివారిపాలెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై బుధవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. ఈ ప్రమాదంలో శ్రీశైలానికి చెందిన లక్ష్మయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సంతమాగులూరుకు చెందిన ఆదినారాయణకు తీవ్ర గాయాలయ్యాయి, వీరిద్దరూ మోటారుబైకుపై కందుకూరు నుంచి రోళ్లపాడు గ్రామానికి వెళ్తుండగా, అదే సమయంలో పామూరు నుంచి కందుకూరు వైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. వీళ్లు రోళపాడు గ్రామంలోని ఓ రైతు వద్దకు సేద్యం పనుల నిమిత్తం వచ్చినట్లు తెలుస్తోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మరిదినాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. లక్ష్మయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి

బేస్తవారపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ జితేంద్రకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నుంచి కౌలుదార్లకు ఎటువంటి సహకారం అందడం లేదని,బ్యాంకు రుణాలు ఇవ్వడంలేదని ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులను ఆదుకోవాలని, ఇందుకోసం ఓ సమగ్రమైన కౌలు రైతుల చట్టం తీసుకురావాలని వారు అందులో కోరారు. ఈకార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి డాకాల పుల్లయ్య, సహాయ కార్యదర్శి జోసఫ్ పాల్గొన్నారు.



సంతనూతలపాడులో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్

లబ్ధిదారుల ఇళ్లకు తిరుగుతూ.. ఆరోగ్యంపై వాకబు చేస్తూ..

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో వినూత్నంగా ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఇచ్చే ఆర్థిక సహాయం అందజేతలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ వినూత్నంగా వ్యవహరించారు. సాధారణంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి కీలక నేతల సిఫార్సుతో ఈ సాయం అందుతుంది. వారి సిఫార్సుకు అనుగుణంగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు లేదా ముందస్తుగా ఆపరేషన్‌లకు వీలుగా ఎన్‌వోసీలు సీఎం ఆఫీసు నుంచి ఇస్తుంటారు. అలాంటి చెక్కులను... సిఫార్సు చేసిన ప్రజాప్రతినిధులకు పంపిస్తారు. వాటిని ఆ ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు లేదా వారి బంధువులను తమ కార్యాలయాలకు పిలిపించి అందజేస్తారు. అయితే సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ అందుకు భిన్నంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి ఆరోగ్యం గురించి వాకబు చేసి మరీ చెక్కులను అందజేసే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా బుధవారం ఆయన సంతనూతలపాడు మండలంలోని వేములపాడు, గుమ్మనంపాడు, సంతనూతలపాడు, మైనంపాడు, చలప్పాలెం, గురువారెడ్డిపాలెం, ఎండ్లూరు, మంగమూరు తదితర 11 గ్రామాల్లో ఉదయం 10 నుంచి రాత్రి వరకు విస్తృతంగా పర్యటించారు. మొత్తం 27 మందికి రూ.20.11 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. సాధారణంగా ప్రభుత్వం ద్వారా వ్యక్తిగతంగా ఆపన్నులకు, పేదలకు లబ్ధిచేకూరే పథకాల అందజేతకు అధిక ప్రాధాన్యత ఇచ్చే ఎమ్మెల్యే ఈసారి నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడం పట్ల గ్రామీణ ప్రజానీకం హర్షం వ్యక్తంచేస్తున్నారు.




అదుపు తప్పితే.. అంతే సంగతులు!

పల్లెల్లో పొలం పనులు ముమ్మరంగా ఉన్న నేపథ్యంలో ట్రాలీ ఆటోల్లో కూలీలను పరిమితికి మించి ఎక్కిస్తున్నారు. పది మంది పట్టే ట్రాలీ ఆటోలో 40 మందికిపైగా తరలిస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై అధికారులు చర్యలు చేపట్టకపోవటంతో వాహనదారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బల్లికురవ మండలం సంతమాగులూరు మండలానికి పలు గ్రామాల నుంచి కూలీలను మిర్చి, పత్తి, పొగాకు పంటలలో పనుల కోసం వాహనాల్లో పరిమితికి మించి తరలిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- బల్లికురవ, ఆంధ్రజ్యోతి

కొప్పోలులో డ్రైనేజీ అధ్వానం

- మురుగునీరు బయటకు పోని పరిస్థితి
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- దోమలతో బెంబేలెత్తిపోతున్న గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు



అంబేద్కర్‌కాలనీలో పేరుకున్న మురుగు



పూడిపోయిన డ్రైనేజీ కాలువ

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు గ్రామంలో పారిశుధ్య అధ్వానంగా మారింది. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో గృహాలు నుంచి వచ్చే మురుగు నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో రోజులు తరపడి మురుగు నీరు నిలిచిపోవటంతో దుర్వాసన ఎదజల్లుతోంది. దీనికితోడు డ్రైనేజీలు దోమలు ఉత్పత్తికేంద్రంగా మారాయి. దీంతో స్థానిక అంబేద్కర్‌కాలనీ, గాంధీనగర్, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, ప్రాథమిక పాఠశాల వద్ద మురుగు సమస్య వేధిస్తోంది. ఇక పంచాయతీ కార్యాలయ సమీపంలో, పాఠశాల వద్ద మురుగునీరు నిలిచి పోతోంది. సాయంత్రం అయితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దీనికితోడు డ్రైనేజీ కాలువల వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో రాత్రులు పాములు బయట తిరుగుతున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రైనేజీ సక్రమంగా లేదు..



గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో మురుగు నీరు బయటకు పోవటం లేదు. ఎక్కడ నీరు అక్కడే ఉండిపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమలు పెరిగి రోగాలను వ్యాపింపజేస్తున్నాయి. మురుగు సమస్య పరిష్కరించాలి.

- కాట్రగడ్డ బ్రహ్మయ్య, స్థానికుడు

దోమలతో అల్లాడుతున్నాం..



మురుగు నీటి కాలువలు దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. సాయంత్రం అయతే రోడ్డుపైన, ఇళ్లలో ఉండే పరిస్థితి లేకుండా పోతోంది. పశువులు కూడా దోమకాటు వల్ల పాల ఉత్పత్తి తగ్గిపోతున్నది. గ్రామంలో మురుగు సమస్య పరిష్కరించి దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- పాతూరి చంద్రయ్య, స్థానికుడు

టీడీపీ డిజిటల్ క్యాలెండర్ ఆవిష్కరణ



డిజిటల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుమార్తె తనూజాలక్ష్మి జన్మదినం పురస్కరించుకుని డీజేఆర్ డిజిటల్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జనార్దన్, ఆయన సతీమణి నాగసత్యలత, డాక్టర్ గుండవరపు రాఘవ, నిడమనూరి పావని, బండారు మదన్, మేడికొండ మోహన్ తదితరులు క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీజేఆర్ ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ ద్వారా డీజేఆర్ డిజిటల్ క్యాలెండర్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

27న నాగభైరవ సాహిత్య పురస్కార సభ

ఒంగోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కవి, దివంగత డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ప్రతి సంవత్సరం నిర్వహించే నాగభైరవ సాహిత్య పురస్కార సభ ఈ నెల 27వ తేదీన గుంటూరు అన్నమయ్య కళావేదికలో జరుగనుంది. ఈ సంవత్సరం నాగభైరవ సాహిత్య పురస్కారానికి కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, రెడ్డి బీఈడ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శెట్టిం చంద్రమోహన్‌లను ఎంపిక చేసినట్లు పురస్కార కమిటీ ఛైర్మన్ డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పురస్కార గ్రహీతలకు వర్తమానం పంపినట్లు పేర్కొన్నారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగే పురస్కార సభలో పురస్కార గ్రహీతలకు నగదు బహుమతిని సైతం అందజేస్తామన్నారు. కాగా పురస్కారానికి ఎంపికైన సాహితీవేత్తలకు నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, గాయకుడు నూకతోటి శరత్‌బాబు, బీరం అరుణ, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, మారేపల్లి సూర్యకుమారి, డాక్టర్ మున్నంగి రాజకుమారి తదితరులు అభినందనలు తెలిపారు.

22న ధర్నా : ఏపీటీఎఫ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వతేదీ నుంచి విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అనేక సార్లు విద్యాశాఖాధికారిని కలిసి వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని, లేనిపక్షంలో ధర్నాలు చేపట్టాల్సి వస్తోందని వారు హెచ్చరించారు.

పేస్ కళాశాలతో సీఎస్ఈఈ ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ ఫర్ సస్టైనబుల్ ఇన్విరాన్‌మెంట్ అండ్ ఎడ్యుకేషన్(సీఎస్ఈఈ) తెలంగాణ ఎన్‌జీవోతో అవగాహన ఒప్పందాన్ని (ఎంఓయూ)ను చేసుకున్నారు. కళాశాల విద్యార్థులకు, బోధన సిబ్బందికి పర్యావరణ సంబంధిత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, నిరుద్యోగులు, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ప్రాంత ప్రజల జీవనశైలిని, వసతులు మెరుగుపర్చుకునే సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఈ ఒప్పందం చేసుకున్నట్లు ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం.శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, సీఎస్ఈఈ ప్రెసిడెంట్ దర్గాసాహెబ్, డీన్ ఆర్.వీరాంజనేయులు, సీవీ.సుబ్బారావు, ఎన్ఎసెస్ ప్రోగ్రామ్ అధికారి మల్లికార్జునరావు, బి.సురేష్‌కుమార్, అనిల్‌కుమార్, ప్రథమ విభాగ డీన్ సుబ్బారావు పాల్గొన్నారు.

బత్తులవారికుంటను మంచినీటి చెరువుగా మార్చాలి : సీపీఎం

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్‌లో ఉన్న బత్తులవారికుంటను మంచినీటి చెరువుగా మార్చడంతో పాటు వాకింగ్‌గా ఏర్పాటు చేయాలని సీపీఎం నగర కార్యదర్శిచీకటి శ్రీనివాసరావు కోరారు. బుధవారం స్థానిక బాలాజీనగర్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16వ డివిజన్‌లో గిరిజనులు, దళితులు ఎక్కువ మంది కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, అందువల్ల ఈ ప్రాంతంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు బత్తులవారి కుంటను మంచినీటి చెరువుగా మార్చి నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంద్రశేఖర్‌వి చౌకబారు మాటలు

- జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే అర్హత యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు లేదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ప్రశ్నించారు. ఆ మేరకు బుధవారం ఒక వీడియోను రిలీజ్ చేశారు. దగా కోరు రాజకీయం చేసే నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. చంద్రశేఖర్ మొదటి సారిగా ఎమ్మెల్యేగా గెలిచారని, ఇష్టారీతిన మాట్లాడితే సహించేది లేదన్నారు. ముందు ప్రజాసమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలని, ఇలాంటి చౌకబారు మాటలు మానుకోవాలని, లేకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఒంగోలు నగరంలో బుధవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. స్కంధగరి శ్రీగిరి ప్రదక్షిణ సేవా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పలు రకాల పుష్పాలతో అలంకరించిన రథంపై శ్రీవేంకటేశ్వరస్వామి వారిని ఉంచి విష్ణు సహస్రనామ పఠనంతో జయరాం సెంటర్‌లోని గోశాల వద్ద అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. అనంతరం కోర్టు సెంటర్, కేశవస్వామిపేట, శర్మా కళాశాల, సీతారాంపురం గద్దలగుంట మొదలైన రహదారులలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించి స్కంధగిరి కొండపైకి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు బొమ్మరెడ్డి రాఘవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థి ప్రతిభ

మద్దిపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మద్దిపాడుకు చెందిన వావిలాల హర్షిత్ ఉత్తమ ప్రతిభ కనబర్చారు. 99.45 శాతం పర్సంటైల్ సాధించారు. వావిలాల మహేష్, శ్రీలతల కుమారుడైన హర్షిత్‌ను ఉపాధ్యాయులు, మిత్రులు అభినందించారు.

ఘనంగా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ప్లాటినం జూబ్లీ వేడుకలు



వేడుకల సభలో మాట్లాడుతున్నఎమ్మెల్యే దామచర

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-1104 ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం ఒంగోలులోని విద్యుత్‌భవన్ సమీపంలో సంఘ కార్యాలయం నూతన భవనం ప్రారంభిచడంతోపాటుగా మెడికల్ క్యాపు, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీలు హాజరై వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ విద్యుత్‌శాఖ కార్మికులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈ హరిబాబు, యూనియన్ జిల్లా కార్యదర్శి రాచగర్ల సంజీవరావు, కార్యనిరహక అధ్యక్షుడు బి.సురేష్, నాయకులు పాల్గొన్నారు.

మిస్సింగ్ సిటిజన్ సర్వే వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): మిస్సింగ్ సిటిజన్ సర్వేను వేగవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో రాజశేఖర్‌రావు ఆదేశించారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో బుధవారం సర్వేపై సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మిస్సింగ్‌సిటిజన్ సర్వేలో కచ్చితత్వం ఉండాలన్నారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తిని మిస్సింగ్ సిటిజన్ యాప్‌లో ఆధార్ కార్డు నంబరుతో అనుసంధానం చేయాలన్నారు. రాబోవు రోజుల్లో సంక్షేమ పథకాలు అందాలంటే సిటిజన్ సర్వేలో పేర్లు నమోదు అయ్యి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తిరుపతిలో ఒక మహిళను మోసం చేసిన జనసేన పార్టీ నాయకుడిని వెనుకేసుకొని రావడం దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్రంలో అనేక సంఘటనలు జరుగుతున్నా పట్టించుకుని పరిస్థితి ఏర్పడిందని, ఏదేమని ప్రశ్నిస్తే సహించలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని మండిపడ్డారు.

'మలినేని'లో కుష్ఠు వ్యాధిపై అవగాహన

సింగరాయకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుమళ్ల పంచాయతీ పరిధిలో ఉన్న మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగిమచ్చలు, కనురెప్పలు, బొమ్మల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లుచేతులు తిమ్మిర్లు రావడం కుష్ఠు లక్షణాలు అని తెలిపారు. ఈ లక్షణాలు కలిగివారు వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దామా వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గోపాలకృష్ణమూర్తి, ఏవో పి.వెంకటేశ్వర్లు, హెచ్‌వోడీ వసుమతి పాల్గొన్నార్లు.

పార్క్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న పీడీ జోసఫ్‌కుమార్, అధికారులు

కొండపి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కింద నిర్మించనున్న విలేజ్ పార్క్ కోసం కొండపి-కట్టావారిపాలెం గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ స్థలాన్ని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రామాంజనేయులు, ఏపీవో మహాలక్ష్మి, కొండపి గ్రామ పంచాయతీ కార్యదర్శి బిళ్లా అంకయ్య ఉన్నారు.

సేంద్రియ ఎరువులను వాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రత్యూష

మద్దిపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడాలని ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష కోరారు. బుధవారం కొలచనకోట, మల్లవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొంత పొలం ఉన్న రైతులు యూనిక్ నెంబర్ కోసం రైతు సేవ కేంద్రాలలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. బిందు సేద్యం, తుంపర సేద్యానికి రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎస్సీ రైతులకు తైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాక్టర్ రాయతీపై అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పండ్ల తోటలు ఉన్న రైతులకు వేసవికాలంలో ఇబ్బంది లేకుండా నీటి కుంటలు తీసుకునేందుకు రాయితీఇ ఇస్తున్నట్లు చెప్పారు. మామిడి తోటలలో పూత సరిగా రావటానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రా, బోరాన్ 2 గ్రాములు, జింక్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. తేనె మంచు పురుగు నివారణకు ప్రైడ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని ప్రత్యూష పేర్కొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'శ్రీసరస్వతి' విజయకేతనం

జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలు కళాశాల విద్యార్థులవే.. ● అభినందించిన చైర్మన్ రమణారెడ్డి



విద్యార్థులకు బొకేలు అందజేస్తున్న చైర్మన్ రమణారెడ్డి, డైరెక్టర్లు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలను సాధించినట్లు శ్రీసరస్వతి విద్యా సంస్థల ఛైర్మన్ ఏవీ.రమణారెడ్డి వెల్లడించారు. స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీసరస్వతి విద్యాసంస్థలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సరస్వతి విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ విద్యాసంస్థకు మంచి గుర్తింపు తెచ్చారన్నారు. కె.లోక్‌క్రితి 98.82 పర్సంటైల్, కె.గుణశేఖర్‌రెడ్డి 98.71, ఎస్.ఇంద్ర 98.06 పర్సంటైల్ సాధించి జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. బి.రిత్విక్ 96.56, జి.ఎనుష్‌రాయ్ 96.21, కె.రథసారధి 96.09, వి.పవన్‌కళ్యాణ్ 95.37 పర్సంటైల్ సాధించారని చెప్పారు. ఇక మాథ్స్‌లో 100కు 99.36 పర్సంటైల్, ఫిజిక్స్‌లో 99.02, కెమిస్ట్రీలో 99.18 పర్సంటైల్‌ను తమ విద్యార్థులు పొందినట్లు చెప్పారు. 90 పర్సంటైల్ పైగా 20 మంది, 85 పర్సంటైల్ పైగా 38 మంది, 80 పర్సంటైల్‌కు పైగా 56 మంది విద్యార్థులు సాధించారన్నారు. జేఈఈ అడ్వాన్స్‌కు 161 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారని రమణారెడ్డి తెలిపారు. జిల్లాలో టాప్ 10 స్థానాలు ఒక్క సరస్వతి విద్యా సంస్థల విద్యార్థులే సాధించారన్నారు. జాతీయస్థాయిలో శ్రీ సరస్వతి విద్యా సంస్థలకు గుర్తింపు తెచ్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, అధ్యాపకులను రమణారెడ్డి అభినందించారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను బొకేలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశివశంకర్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్, ప్రిన్సిపాల్స్, డీన్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో పలు సంఘాల నాయకుల డిమాండ్ ● నిధుల సాధనకు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూ.2వేల కోట్లను కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమయ్యే రూ.4వేల కోట్ల నిధుల సాధన కోసం ఐక్యకార్యాచరణ రూపొందించాలని కోరారు. వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు జె.జయంతిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విజన్ -2047 పేరుతో కలల ప్రపంచాన్ని సృష్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఆలోచించాలన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ.4వేల కోట్లు అవసరమవుతాయని, తక్షణమే రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాను వెనుకబడిన ప్రాంతంగా గుర్తించిన కేంద్రం ఆ మేరకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ నీటి వనరుల ద్వారా అభివృద్ధి సాధ్యమని గుర్తించిన పాలకులు వెలిగొండకు రూపకల్పన చేసి అమలులో అలసత్వం ప్రదర్శించారని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుడుతూ గత 40 ఏళ్ళుగా వెలిగొండ సాధన కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి రావడం విచారం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాంత ప్రజలను మభ్యపెట్టి జాతికి అంకితం పేరుతో జగన్మోహన్‌రెడ్డి చేసిన నిర్వాకంవల్ల కొల్లంవాగు పూడిపోయిందని చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ వెలిగొండ ప్రాంతవాసులు సాగునీటి కోసం వేలాది అడుగుల్లో బోరు వేస్తున్నా పంటలను కాపాడుకోలేక పోతున్నారన్నారు. ప్రాజెక్టుకు నిధులు రాబట్టేందుకు ఈనెల 20న మండల కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చుండూరి రంగారావు, కంకణాల ఆంజనేయులు, బాలకోటయ్య, కె.లలితకుమారి, ఆర్.మోహన్, కిలారి పెద్దబ్బాయి, ఎం.రమేష్, సుబ్బారావు, రవీ, వై.సిద్ధయ్య, పెంట్యాల హనుమంతరావు, శ్రీనివాసరావు, జీవీ.కొండారెడ్డి, బి.రఘురాం, తిరుమలరావు, శేషయ్య పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ దామోదర్



కర్నూలురోడ్డులోని బ్లాక్‌స్పాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

చీమకుర్తి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ సిబ్బందికి సూచించారు. బుధవారం చీమకుర్తి, సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలన్నారు. సంతనూతలపాడు నుంచి చీమకుర్తి వరకూ ఉన్న కర్నూల్‌రోడ్‌పై తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్‌స్పాట్లను స్వయంగా వీక్షించారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. గెలాక్సీ గ్రానైట్ క్వారీలు, అనుబంధపరిశ్రమల్లో భద్రతాప్రమాణాలు పెంపొందించటం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని చెప్పారు. మహిళలు, చిన్నారులకు సంబంధించే ఫిర్యాదుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల మర్యాదగా మెలగాలని కోరారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలకు తావివ్వకుండా చూడాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి అరికట్టాలన్నారు. చీమకుర్తిలో పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత స్టేషన్ ఆవరణలో సిబ్బందితో మాట్లాడుతూ పలు విషయాలు తెలిపారు. ప్రతిభపాటవాలను ప్రదర్శించే సిబ్బందికి తగిన గుర్తింపుతోపాటు రివార్డులు అందజేస్తామన్నారు. మహిళా సహాయక కేంద్రం, రికార్డుల గదులు, లాకప్, ఇతర గదులను వీక్షించారు. స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలను త్వరగా డిస్పోజ్ చేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, రూరల్‌సీఐ శ్రీకాంత్‌బాబు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్ఐలు కృష్ణయ్య, అజయ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు నాణ్యత కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కొండపి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నాణ్యత కోల్పోకుండా రైతులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో సాగు చేసిన పొగాకు తోటలు, క్యూరింగ్‌లో ఉన్న ఆకును ఆయన సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. పొగాకులో అన్యపదార్థాలు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రామానికి చెందిన వాకా శ్రీకాంత్ అనే రైతుకు ప్రోత్సాహంగా రూ.10వేల చెక్కును అధికారులు అందజేశారు. కార్యక్రమంలో సీటీఆర్ఐ కందుకూరు శాస్త్రవేత్త జి.గంగాధర్, క్షేత్రఅధికారి ఉపేంద్ర, ఐటీసీ కంపెనీ ప్రతినిధి వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.



పొగాకు తోటలను రైతులతో కలిసి పరిశీలిస్తున్న వేలం కేంద్రం అధికారులు

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రైతులు పట్టాదార్ పాస్ పుస్తకాలతో రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో రమేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని ఆయన పేర్కొన్నారు. వన్ బి పాస్‌బుక్, అడంగల్, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం, సెల్‌ఫోన్ తమ వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే పీఎం కిసాన్ నిధులు విడతలవారీగా జమ అవుతాయని ఏవో తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

మద్దిపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ సృజన్‌కుమార్ కోరారు. బుధవారం ఇనమనమెళ్లూరులో ఇళ్ల నిర్మాణాలు, స్థలాలను ఆయన పరిశీలించారు. అనంతరం బసవన్నపాలెం సచివాలయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, సమయపాలన పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణయ్య వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ పంట పరిశీలన

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం కొత్తమామిడిపాలెం గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు గ్రామ పరిధిలో సాగు చేసిన శనగపంటను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ జి.రమేష్‌బాబు, ఏవో జి.కిషోర్‌బాబు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ డీఈవో, లయన్స్‌క్లబ్ సభ్యులు

సేవా కార్యక్రమాలు అభినందనీయం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించిన లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయం అని ఉప విద్యాశాఖాధికారి బి.శ్యామ్యూల్ జాన్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్యూల్ జాన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు అందించిన గొడుగులను వీధి వ్యాపారులు, చెప్పులు కుట్టే వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణారావు, కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి రంగయ్య, అడ్మినిస్ట్రేటర్ ఎం.శివప్రసాద్, ఉపాధ్యక్షులు భూపని కాశయ్య, డైరెక్టర్లు జగన్ బాబు, కృష్ణమూర్తి, గోపాల్, విజయరావు, గోపి, నరసింహారావు, వెంకట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చౌటపచర్లలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టీడీపీ నాయకులు

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పుల్లలచెరువు,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐటీవరం పంచాయతీలోని చౌటపచర్లలో 70 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. బుధవారం చౌటపచర్ల ఎస్సీ కాలనీలో అధికారులు,టీడీపీ నాయకులు రోడ్డు పనులను ప్రారంభించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు పొట్ల గోవిందు,పావులూరి యోగయ్య,రమేష్, గద్దె మల్లయ్య, ఎస్ సుబ్బారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రిలే దీక్షలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫి అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు బుధవారం దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు 17 రోజుల సమ్మె సందర్భంగా కార్మికులకు, ప్రభుత్వానికి జరిగిన చర్చల్లో ప్రభుత్వం ఇచ్చిన ఒప్పందాలకు వెంటనే జీవోలు ఇవ్వాలన్నారు. హామీలను వెంటనే అమలు చేసి కార్మికులకు చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. జీవో 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, సలాంఖాన్, శ్రీను, చెన్నకేశవులు, గురునాథం తదితరులు పాల్గొన్నారు.



గోశాలను పరిశీలిస్తున్న సీఐ సుబ్బారావు, కమిషనర్ నారాయణరావు

అటవీ సమీప గిరిజనగూడేలకు ఆవుల తరలింపు

మార్కాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్, పారిశుద్ధ్యానికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్న ఆవులను త్వరలో నల్లమల అటవీ సమీపంలోని గిరిజన గూడేలకు తరలిస్తామని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలోని సాగర్ నీటి ట్యాంకు స్థలం వద్దకు ఇప్పటికే మున్సిపల్ అధికారులు రోడ్లపై తిరుగుతున్న 52 ఆవులను తరలించారు. వాటికి మున్సిపల్ పారిశుధ్య, పశుసంవర్థకశాఖ సిబ్బంది బాగోగులు చూస్తున్నారు. వాటిని బుధవారం సీఐ సుబ్బారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికి 52 ఆవులను మాత్రమే వాటర్ ట్యాంకు వద్దకు తరలించారన్నారు. ఇంకా ఆర్టీసీ బస్టాండ్ నుంచి పూలసుబ్బయ్య కాలనీ వరకు రోడ్లపై తిరుగుతున్న ఆవులను తీసుకురావాల్సి ఉందన్నారు. గోవుల యజమానులను ఇప్పటికే పలుమార్లు హెచ్చరించామన్నారు. అయినా యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. ఇకపై గోవులు రోడ్లపై తిరిగితే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, రూరల్ ఎస్సై అంకమ్మరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.చెన్నకేశవులు పాల్గొన్నారు.

బారికేడ్‌లతో బేజారు

ప్రధాన రహదారిపై అనవసరంగా ఏర్పాటు

ప్రయాణికులకా లేక అరటిబండ్లకా అని విమర్శలు

పొదిలి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పెద్దబస్టాండ్ సెంటర్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. కానీ ప్రయాణికులు ఉండడానికి నీడ మాత్రం లేదు. ఏగ్రామానికి వెళ్లాలన్నా బస్సు, ఆటో వచ్చేంత వరకు ఇక్కడ ఆగాల్సిందే. అయితే అక్కడ తూతూమంత్రంగా అద్దె చెల్లిస్తూ ఏళ్లతరబడి తోపుడుబండ్ల వ్యాపారులు ఆప్రదేశాన్ని ఆక్రమించుకొని ప్రయాణికులకు నిలువనీడలేకుండా చేస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని పలువురు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా ప్రధాన రహదారికి వన్‌వే విధించి బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ఆ బారికేడ్‌లు ప్రజలకో ,వాహనాలకో కాకుండా అక్కడ అక్రమంగా ఏర్పాటు చేసుకున్న అరటి కాయల బండ్లకు రక్షణ కవచంలా ఏర్పాటు చేయడంతో చూసిన వారు ఇదేమిటని ప్రశ్నిస్తున్నారు. అలా ఏర్పాటు చేయడంతో ఒంగోలు వైపునుంచి వచ్చే వాహనాలు ప్రయాణికులను దింపేందుకు ఒక్క నిమిషం





పెద్దబస్టాండ్ సర్కిల్‌లో ప్రమాదకరంగా ఏర్పాటు చేసిన బారికేడ్‌లు (ఇన్‌సెట్లో) అరటికాయల బండ్లకు రక్షణ కవచంలా ఏర్పాటు చేసిన బారికేడ్‌లు

బస్సులు ఆపినా ట్రాఫిక్ పూర్తిగా ఆగిపోతోంది. సంబంధిత అధికారులు వాటిని అక్కడే ఉంచారుగాని వాటిని తొలగించి సమస్యను తీర్చాలనే విషయం మరిచిపోయారని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షాపులముందు ఇష్టారీతిన చెక్కబల్లలు వేసుకొని వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అసంతృప్తి చెందుతున్నారు. అవసరం లేనిచోట బారికేడ్‌లు ఏర్పాటు చేయడంతో ఇటు వాహనదారులతోపాటు పలు వ్యాపార దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఆప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన ప్రదేశంలో బారికేడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రయాణికులు వేచి ఉండేందుకు స్థలం కేటాయించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పకడ్బందీగా రీ సర్వే నిర్వహించాలి

డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ సత్యనారాయణ

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ (ఆర్‌వో) ఎంవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆయన పరిశీలించారు. గ్రామంలోని రైతులతో ఆయన మాట్లాడారు. ఇన్‌చార్జి తహసీల్దార్, వీఆర్వో, సర్వేయర్‌లతో కలిసి రీ సర్వేను ఆయన పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ఆయన తహసీల్దారు కార్యాలయంలో ఆయ శాఖల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ గ్రామంలో మొత్తం 1,085 ఎకరాలకు గాను 314 ఎకరాలు రీ సర్వే పూర్తి అయినట్లు తెలిపారు. మిగిలిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 261 అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిని సిబ్బందితో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దారు నలగాటి మల్లికార్జున నాయుడు, గ్రామ వీఆర్వో, సర్వేయర్ సిబ్బంది పాల్గొన్నారు.



రీ సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పెషల్ కలెక్టర్



తంబళ్ళపల్లిలో రీసర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

రీసర్వే పరిశీలన

గిద్దలూరు : మండలంలోని తంబళ్ళపల్లి గ్రామాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకటత్రినాగ్ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న రీసర్వే బృందంతో స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గిద్దలూరు రెవెన్యూ కార్యాలయానికి హాజరై సదస్సులో వచ్చిన అర్జీలు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై రివ్యూ చేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన వీఆర్వోలను అభినందించారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నిస్‌లో విన్నర్స్ గిద్దలూరు జట్టు

గిద్దలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ టోర్నమెంటులో గిద్దలూరుకు చెందిన రంగయ్య, మురళీమోహన్ జట్టు డబుల్స్ విభాగంలో విన్నర్స్‌గా నిలిచారు. 45పైన విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో నర్సరావుపేటకు చెందిన రాము, కోటిరెడ్డిలను 6-5 స్కోరు తేడాతో ఓడించి రంగయ్య, మురళి మోహన్‌రెడ్డి జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజేతలైన క్రీడాకారులను స్థానిక టెన్నిస్ స్టేడియంలో లాన్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి.కె.మోహన్‌రెడ్డి, టెన్నిస్‌క్లబ్ ప్రతినిధులు వీరరాఘవులు, శివప్రసాద్, ఖాదర్‌బాషా, టపావలి, కోటయ్యగౌడ్ తదితరులు సన్మానించి అభినందించారు.



టెన్నిస్ విజేతలను సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):ఈక్రాప్‌కు సంబంధించి ఈకేవైసీ చేస్తున్నందున ప్రతి రైతు చేయించుకోవాలని, ఆతరువాత ఈక్రాప్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ రెడ్డి కర్షకులకు సూచించారు. మండలంలోని కొత్తకోట, కొమ్మునూరు గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా గుర్తింపు సంఖ్యను పొందాలని పేర్కొన్నారు. ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ, వ్యవసాయ సహాయకులు మస్తాన్, యూసఫ్ పాల్గొన్నారు.



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ప్రతి రైతుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఎర్రగొండపాలెం రూరల్ : సాగులో ఉన్న ప్రతి రైతు వారి పేర్లను రైతు సేవా కేంద్రంలో రైతు (ఫార్మ) రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఏవో కేవీ శేషారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తమ్మడపల్లి, గుర్రపుశాల గ్రామాలలో రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు పొలం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతు సేవా కేంద్రంలోని సిబ్బందికి రైతు పాసు పుస్తకం, 1బి, అడంగల్ నకలు తీసుకొని వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ముందుగా ఆయా గ్రామాలలో రైతుల పంట పొలాలను పరిశీలించారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

తర్లుపాడు : రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కేతగుడిపి, బుడ్డపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి రమేష్, వ్యవసాయ సహాయకుడు బాబు, రైతులు పాల్గొన్నారు.

పుల్లలచెరువులో..

పుల్లలచెరువు : భూమి సాగు చేస్తున్న ప్రతి రైతు భరోసా కేంద్రంలో తమ పేరు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలని మండల వ్యసాయయశాఖ అధికారి పి. నిర్మలా దేవి అన్నారు.బుధవారం పుల్లలచెరువు రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. దీని ద్వారా పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట రుణాలు,మార్కెట్‌కొనుగోలు సౌకర్యం ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో వీఏఏలు,రైతులు పాలొన్నారు.

ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి తహసీల్దారుగా మల్లికార్జున నాయుడు

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం తహసీల్దారుగా ఉన్న ఏ బాలకిషోర్ పలు ఆరోపణలతో 10 రోజులుగా సెలవులో ఉన్నారు. సోమవారం బాధ్యతలు తీసుకున్న ఆయన మళ్లీ మంగళవారం నుంచి ఆరోగ్య సమస్యలతో సెలవు పెట్టారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న నలగాటి మల్లికార్జునకు ఇన్‌చార్జి తహసీల్దారుగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

17న బండలాగుడు పోటీలు

గిద్దలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 17వ తేదీన శ్రీఅభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆదర్శ విద్యాసంస్థల అధినేత బుడత తిమ్మయ్య తెలిపారు. 6 పండ్ల విభాగంలో జరుగనున్న బండలాగుడు పోటీలలో 1వ విజేతకు రూ. 40వేలు, 2వ విజేతకు రూ. 30వేలు, 3వ విజేతకు రూ. 25వేలు, 4వ విజేతకు రూ. 15వేలు, 5వ విజేతకు రూ. 10వేలు, 6వ విజేతకు రూ. 5వేలు నగదు బహుమతులు అందజేస్తామని, 500 రూపాయల ఎంట్రీ ఫీజు చెల్లించి పోటీలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

వైభవంగా గాయత్రి యజ్ఞం

పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలోని గాయత్రి దేవాలయంలో బుధవారం గాయత్రి మహాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. లోక కళ్యాణార్థం గాయత్రి యజ్ఞం నిర్వహించినట్లు నిర్వాహకులు రెడ్డి మల్లారెడ్డి, రోశయ్య, పోలయ్య, శివరంగారెడ్డి, ప్రసూన, నారాయణరెడ్డి తెలిపారు. భక్తులకు భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసిన సెల్‌పాయింట్ అధినేత కాశిరెడ్డిని అభినందించారు.

స్వదేశ్ భ్యూషణ్ అవార్డుకు అధ్యాపకుడి ఎంపిక

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీకాలేజీ అధ్యాపకుడు డాక్టరు పి. ప్రదీప్ 2025 స్వదేశ్ భ్యూషణ్ అవార్డుకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఎర్రగొండపాలెంలోని కాలేజీలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆయనను కలసి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరెన్నో అవార్డులు తీసుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ జి. శ్రీధరనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాగ్దేవి అకాడమీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న వై.అఖిలను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ మాట్లాడుతూ అఖిల జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చి 93.45 శాతం పర్సంటేజీ సాధించిందన్నారు. వాగ్దేవి అకాడమీ చైర్మన్ పి.శివారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తర్లుపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తర్లుపాడులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు కారంపూడి వెంకట రమణాచార్యులు, ఆగమాచార్యులు, లక్ష్మణ్ తిలక్, రామ్‌గోపాలాచార్యులు, సాయి మోహన్‌లు స్వామి వారికి మంత్రోచ్చరణలతో విశ్వక్‌సేన, పుణ్యహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణం, బేరీ పూజ, ధ్వజరోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదాతలు జవ్వాజి ఉదయ్ భాస్కర్‌రావు, ధర్మపత్ని శేషుకుమారి, సాయి కృష్ణ, హేమ సాయిలు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, వివిధ వాహనాల ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణం

శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఉదయం 11గంటలకు స్వామివారి కళ్యాణ మహోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు.



డిజిటల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

టీడీపీ డిజిటల్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కుమార్తె తనూజాలక్ష్మి జన్మదినం పురస్కరించుకుని డీజేఆర్ డిజిటల్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జనార్దన్, ఆయన సతీమణి నాగసత్యలత, డాక్టర్ గుండవరపు రాఘవ, నిడమనూరి పావని, బండారు మదన్, మేడికొండ మోహన్ క్యాలెండర్‌ను విడుదల చేశారు.

22న ధర్నా : ఏపీటీఎఫ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వతేదీ నుంచి విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు

క్రైం సమాచారం



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ ప్రభాకరరావు

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

- 19 గ్రాముల బంగారు వస్తువుల స్వాధీనం

పెద్దదోర్నాల,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):దొంగతనం కేసులోని నిందితుడిని శ్రీశైలం సెంటర్‌లో అరెస్టు చేసినట్లు ఎర్రగొండపాలెం సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషనులో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఈనెల 3వతేదీ అర్ధరాత్రి దోర్నాలలోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న రాజేష్‌నాయుడు ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహించారు. 14వ తేదీ తెల్లవారు జామున ఇంటికి వెళ్లగానే తలుపు తాళం పగులగొట్టి ఉండడం, లోపలికి వెళ్లి చూడగానే బీరువా తాళం పగులగొట్టి, బంగారు వస్తువులు అపహరించుకు పోయినట్లు గుర్తించి పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఎస్సై మహేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్ల్యూస్ టీమ్‌ను రప్పించి పరిశీలించి కేసు నమోదు చేశారు. అదే రోజు పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో కూడా ఇంటి తలుపు పగులగొట్టి అక్కడ చోరీ జరిగింది. ఈ రెండు చోట్ల జరిగిన దోపిడీపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నిందితుని కోసం చేపట్టిన గాలింపు చర్యల్లో భాగంగా దోర్నాలలోని శ్రీశైలం సెంటర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. నిందితుడు నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన షేక్ మహబూబ్ బాష(నందు)గా తెలిపాడు. ఇతను గతంలో 15 కేసుల్లో ముద్దాయిగా త్రిపురాంతకం పోలీసుస్టేషనులో నమోదయినట్లు చెప్పారు. చోరీ చేసిన 19 గ్రాముల బంగారు వస్తువులు రికవరీ చేసి, కోర్టుకు తరలిస్తున్నట్లు ఆయన వివరించారు. నిందితుని ఆచూకీలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బంది నారాయణ, శ్రీనులను అభినందించారు. ఈ సమావేశంలో ఎస్సై మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ఎర్రగొండపాలెం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంఘం తాండ సమీపంలో ఎర్రగొండపాలెం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాధారణ తనిఖీలలో భాగంగా మార్కాపురం, ఎర్రగొండపాలెం శాఖ అధికారులు దాడులు నిర్వహించగా నాటుసారా తయారీ చేస్తున్న వాటిపై దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. మార్కాపురం, ఎర్రగొండపాలెం ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ద్విచక్ర వాహనం చోరీ

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఆమేరకు వాహనదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అటవీశాఖ కార్యాలయం వద్ద వెల్డింగ్ షాపు నిర్వహించుకుంటున్న షేక్ మహబూబ్‌బాషా అనే వ్యక్తి తన షాపు వద్ద హీరో డీలక్స్ వాహనం పార్కు చేసి ఉంచాడు. దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కార్డుదారులకు రెండు నెలలుగా అందని కందిపప్పు


రేషన్ వాహనం

దొనకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు పంపిణీ చేసే కందిపప్పును మండలంలో రెండు నెలలుగా పూర్తిస్థాయిలో సరఫరా చేయకపోవటంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం 28 రేషన్‌షాపుల పరిధిలో 14,335 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. కూలీపనులకు వెళ్తేగాని పూట గడవని పేదలకు రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే కందిపప్పు ఎంతో ఆసరాగా ఉండేది. కందిపప్పు బయట మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.150 వరకు పెట్టి కొనుగోలు చేసుకున్న పరిస్థితులు ఎదురయ్యాయని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు పంపిణీ జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

తాళ్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీకే జూనియర్ కళాశాల 48 వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థుల సందడితో కళాశాల ఆవరణ మారుమోగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కొండపల్లి ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపల్ రాజశేఖర్‌రావు, లెక్చరర్లు టి.లక్ష్మయ్య, వై.గురవయ్య, ఎస్.లలిత్ బోస్, డి.పార్వతి పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

తాళ్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో డి.హనుమంతరావు చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్‌అసిస్టెంట్లతో బుధవారం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీవో బి.మురళి, ఈసీ గురుబాబు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు

సీఎస్‌పురం/పామూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న రోడ్లు, ప్రాజెక్టుల నిర్మాణ కార్యక్రమాల్లో భూములు, నివాస గృహాలు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం అలుముకుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సయ్యద్ హనీఫ్ ఆరోపించారు. ఆ పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి పొదిలి నరసింహులు అధ్యక్షత వహించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, నివాసగృహాలు కోల్పోయిన వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదన్నారు. మండలంలో ఏ కొత్తపల్లి, రేగులచెలుక, గుంతచెన్నంపల్లి, ఉప్పలపాడు, కే అగ్రహారం, సీఎస్‌పురం ప్రాంతాల్లో నిర్మిస్తున్న జాతీయ రహదారుల నిర్మాణంలో పరిహారం ఇవ్వకుండానే పనులు చేపడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఊసా రాజ్యలక్ష్మి, ఎస్ తిరుపతిరెడ్డి, బి. జేసురత్నం, పి. నరసింహులు, జి. ఏసుదాసు, థామస్‌లు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీని నిర్మూలించాలి

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం దర్శి పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో సీహెచ్ రమాదేవి మాట్లాడుతూ చిన్నారుల చేత వెట్టిచాకిరీ చేయించటం చట్టవిరుద్ధమన్నారు. తల్లితండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ జి. నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమరవాణాను అడ్డుకుని, వెట్టిచాకిరీని నిర్మూలిద్దామని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ తప్పెట డేవిడ్ చెప్పారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మొబైల్ వ్యాన్ ద్వారా ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.ఇమ్మానియేల్ రాజు, ఎంపీడీవో దారా హనుమంతరావు, ఎంఈవో జి.సుబ్బయ్య, ఏఎస్సై మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఐ.వి.రమణారెడ్డి పాల్గొన్నారు.

పనులను వేగంగా పూర్తి చేయాలి

నియోజకవర్గంలో హాస్టళ్ల నిర్మాణంపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


జాబితాను ఎమ్మెల్యేకు అందజేస్తున్న ఎంఈవోలు

కనిగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నూతన వసతి గృహాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో నూతనంగా నిరిస్తున్న హాస్టల్ భవన నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. అదేవిధంగా పాఠశాల ప్రాంగణ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు నిర్మాణ పనుల పురోగతిని తెలియచేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, కిశోర్, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

ప్రతి పాఠశాల ఆదర్శంగా ఉండాలి

నియోజకవర్గంలోని ప్రతి పాఠశాల రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా తయారు కావాలని ఎమ్మెల్యే సూచించారు. బుధవారం ఉగ్ర నివాసంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంఈవోలు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులతోపాటు ఇతర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రాథమిక పాఠశాలలన్నింటినీ ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేస్తామని ఎమ్మెల్యేకు చెప్పారు. ఇప్పటికే కనిగిరిలో 5, పామూరు 3, వెలిగండ్లలో 1 ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూల్‌గా మార్చేలా తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఎంఈవోలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నియోజకవర్గ మానిటరింగ్ అధికారి దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈవోలు యూవీ నారాయణరెడ్డి, ఆర్ శ్రీనివాసులు, సంజీవి, రాజాల కొండారెడ్డి, సుబ్బారావు, కరుణకుమారి, రమణయ్య, డీ ప్రసాద్, జే ప్రసాద్ లు ఉన్నారు.

బాలికల హాస్టల్ నిర్మాణాలకు నిధులు మంజూరు

పామూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సర్వశిక్ష అభియాన్ పథకం నిధులతో బాలికల ప్రత్యేక హాస్టల్ నిర్మాణాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. పామూరులోని పాత హాస్పిటల్ ప్రాంగణంలో రూ.1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. బాలికల హాస్టల్ నిర్మాణానికి అనువైన స్థలం లేకపోవడంతో పాత హాస్పిటల్ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న బ్రిటీష్ నాటి భవనాన్ని బుధవారం చదును కార్యక్రమం చేపట్టారు. నాలుగు నెలల్లో భవన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ గంజిగుంట్ల సుబ్బారెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో బోయిళ్ల నారాయణరెడ్డి, షేక్ షరీఫ్, సయ్యద్ అమీర్‌బాబు, ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, ఇర్రి కోటిరెడ్డి, ఆర్‌ఆర్ రఫి, వరికూటి చిరంజీవి, ముబినమౌలాలి, పిడుగు శ్రీను, మెంటా నరసింహారావు, పత్తు మస్తాన్, మాచర్ల రహిమాన్, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు

గుంతలు పూడ్చుతున్న అధికారులు


నేడు
రాజంపల్లి-బొద్దికూరపాడు రోడ్డుకు చేస్తున్న మరమ్మతులు


నాడు
మరమ్మతులకు ముందు అధ్వానంగా ఉన్న రోడ్డు

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా రోడ్లను గుంతలరహితంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే అధికశాతం రోడ్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. కొన్నింటికి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని అసలు పట్టించుకోకపోవటంతో అన్నీరోడ్లు అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్లలో ఉన్న గుంతలను చదును చేసి నునుపుగా తీర్చిదిద్దుతున్నారు. మండలంలోని తొమ్మిది ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. 65 కిలోమీటర్ల దూరం గుంతలు పూడ్చి, కంకర, తారు వేసి అభివృద్ధి చేసినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఈ పనులకు ఇప్పటి వరకు రూ.80 లక్షలు ఖర్చుచేశారు.

నాలుగు యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్

మూడు యూపీ స్కూళ్లు మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా ప్రతిపాదనలు


సింగనపాలెం ప్రాథమికోన్నత పాఠశాల

ముండ్లమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ మండల విద్యా శాఖ అధికారులు జిల్లా అధికారులకు పంపిన ప్రతిపాదనలను ఆమోదించారు. సింగనపాలెం, పెదఉల్లగల్లు, సుంకరవారిపాలెం, శంకరాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా మారుస్తున్నారు. అదేవిధంగా వేములబండ, తూర్పుకంభంపాడు, నాయుడుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మారుస్తూ ప్రతిపాదనలను పంపించారు. వీటికి జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర కూడా వేశారు. ఇక కేవలం విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులే వెలువడాల్సి ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి యూపీ పాఠశాలలుగా కొనసాగుతుండటంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. ఇటీవల యూపీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి హైస్కూళ్లుగా మార్చేందుకు విద్యా శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు వాటి ఫైళ్లు వేగంగా కదిలాయి. దీంతో వచ్చే విద్యా సంవత్సరానికి ఆ పాఠశాలలు హైస్కూళ్లుగా మారనున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఆ పాఠశాలలను రద్దు చేస్తూ వాటి స్థానంలో మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నారు. దీంతో యూపీ పాఠశాలలు హైస్కూళ్ళుగా ఏర్పాటు కానుండటంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు పంటలకు తక్కువ ఖర్చు పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ చెప్పారు. బుధవారం మండలంలోని జమ్మలమడక, మారెళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ బాలవెంకటయ్య, రైతులు కోనంకి శ్రీను పాల్గొన్నారు.


మారెళ్లలో మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న ఏవో ఫరూక్

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కందిపంటలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి. రమేష్ సూచించారు. మండలంలోని తూర్పువెంకటాపురంలో కంది క్షేత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు రైతులు సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కందిపంటకు సోకిన ఎండుతెగుళ్ల నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

కురిచేడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి రైతుకూ 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రభుత్వం అందిస్తోందని, రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ సిబ్బంది బుధవారం మండలంలోని ఆవులమంద, పడమరగంగవరం గ్రామాల రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులతో మాట్లాడారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


సమస్యలను తెలుసుకుంటున్న చైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేశ్వరరావు

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 1వ వార్డులో ఆయన కమిషనర్ మహేశ్వరరావుతో కలిసి బుధవారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు గృహాల మీదుగా వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. మురుగు కాల్వలు, సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. వెంటనే చైర్మన్ పిచ్చయ్య విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గృహాలపై వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాల్వలు నిర్మించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వలసబాట పట్టిన మూగజీవాలు


దొనకొండ మీదుగా వలసబాట పట్టిన మూగజీవాలు

దొనకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే మూగజీవాలకు గ్రామాల్లో పశుగ్రాసం కొరత కారణంగా వలసబాట పట్టాయి. పశ్చిమ ప్రాంతంలోని పశుపోషకులు వారి స్వగ్రామాలను వదిలి దొనకొండ మీదుగా గడ్డి, నీరు దొరికే ప్రాంతాలకు వలసబాట పట్టారు. వర్షాకాలం ప్రారంభమై సమృద్ధిగా గడ్డి లభించే వరకు తమ జీవాలకు గడ్డి, నీరు దొరికే ప్రాంతాలకు తిప్పుకుంటూ బతికించుకుంటామని పశుపోషకులు వాపోయారు. ప్రభుత్వం పశుగ్రాసాన్ని కాపాడి రైతులకు సబ్సిడీ అందించాలని పలువురు పశుపోషకులు కోరుతున్నారు.

పురుగు మందు తాగి యువకుడు మృతి

అవీఇవీ


గొర్రె బాలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం గ్రామానికి చెందిన గొర్రె వెంకటేశ్వర్లు, రోశమ్మల ద్వితీయ కుమారుడు బాలు(20) పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాల్లోకి వెళితే.. బాలు 10వ తరగతి వరకు చదువుకొని అనంతరం ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేసుకుంటూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. అతను ఈ నెల 10న పురుగుల మందు తాగటంతో కుటుంబ సభ్యులు ఒంగోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తండ్రిని హత్య చేసిన కొడుకు అరెస్టు


నిందితుడిని చూపిస్తున్న సీఐ హస్సాన్, ఎస్ఐ త్యాగరాజు

దొనకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడైన కొడుకును బుధవారం అరెస్టు చేసి దర్శి కోర్టులో హాజరుపర్చినట్లు త్రిపురాంతకం సీఐ హస్సాన్ చెప్పారు. దొనకొండ మండలంలోని ఇండ్లచెరువు గ్రామంలో గత ఆదివారం తండ్రి పైడిపోగు యేసు నిద్రిస్తుండగా కొడుకు పైడిపోగు మరియదాసు దారుణంగా హత్య చేసిన సంఘటన తెలిసిందే. ఆ సంఘటనలో నిందితుడు మరియదాసుపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి అతడిని దర్శి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ త్యాగరాజు, హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

సీఎస్‌పురం/పామూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్కల దాడి ఘటనలో 20 గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతలపాలెంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతం మల్లికార్జున గ్రామసమీపంలోని పొలంలో గొర్రెల దొడ్డి ఏర్పాటు చేసుకొని ఉన్నాడు. అందులో 40 గొర్రె పిల్లలు ఉన్నాయి. వీధి కుక్కలు దొడ్డిలో దూరి 20 గొర్రె పిల్లలను చంపి తిన్నాయని, మరో 10 పిల్లలను గాయపరిచాయని బాధితుడు కన్నీరుమున్నీరుగా విలపించాడు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి మునీర్ తన సిబ్బందిని పంపించి గాయపడిన వాటికి చికిత్స చేయించారు.

సీసీరోడ్లను తనిఖీ చేసిన అధికారులు


సీసీరోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కురిచేడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : కురిచేడు మండలంలో కోటి రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన సిమెంట్ రోడ్లను బుధవారం మార్కాపురం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. రోడ్డు మందం ఎంత ఉందో ప్రత్యేక యంత్రంతో తీసి పరీక్షించారు. కురిచేడులో 7 సీసీరోడ్లు, ఆవులమందలో 3 సీసీ రోడ్లు నిర్మించారని వాటిని తనిఖీ చేస్తామని క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ రమేష్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ అధికారులు, కురిచేడు పంచాయతీరాజ్ ఏఈఈ ఏ వెంకటేశ్వర రెడ్డి ఉన్నారు.

భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ముండ్లమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, రీ సర్వేల్లో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇళ్ల స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ముందుగా పోరంబోకు స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు వెంటనే పొజిషన్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, మండల సర్వేయర్ కోటంరాజు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో ఇరిగినేనికి సుస్థిరస్థానం


ఇరిగినేని చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దారపనేని

పామూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మచ్చ లేని రాజకీయాలు నడిపి నియోజకవర్గ ప్రజల హృదయాల్లో ఇరిగినేని సుస్థిర స్థానం సంపాదించుకొని నేటి తరానికి ఆదర్శంగా నిలిచారని ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతినాయుడు 8వ వర్ధంతి కార్యక్రమాన్ని పామూరులోని దారపనేని క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు కావిటి సుబ్బయ్య, పోకా నాయుడుబాబు, ఖాజారహంతుల్లా, షేక్ ఖాదర్‌మొహిద్దీన్, నరసింహనాయుడు, మనం వెంగళరావు, నూతంగి నారాయణ, హరికృష్ణ పాల్గొన్నారు.

110 మంది విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

కురిచేడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కురిచేడులో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 110 మందికి లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు ఆధ్వర్యంలో బుధవారం ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 83 మంది 10వ తరగతి విద్యార్థులు, 11 మంది ఇంటర్ విద్యార్థులకు వాటిని అందచేశారు. బాలికల ఉన్నత పాఠశాల 16 మంది విద్యార్థినులకు కూడా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్ జోన్ చైర్మన్ జేబీ రామారావు, అధ్యక్షులు వీవీ రమణారావు, కోశాధికారి ప్రసాదరావు, డైరెక్టర్ ఇందూరి వెంకట నరిసిరెడ్డి, గ్రంధిశీల అల్లూరి నాగరాజు, వంకాయలపాటి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు సాయి, బీ మాధవీలత, ఉపాధ్యాయులు శింగరయ్య, హిల్డా నైటింగేల్, వెంకటేశ్వర్లు, కల్యాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారాన్ని లయన్ సభ్యులు ఇందూరి వెంకట నరిసిరెడ్డి కుమార్తె డాక్టర్ చందనా రెడ్డి అందించారు.

అమ్మవారికి ఆదిత్యుని అభిషేకం



పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకూరు గ్రామంలో కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీబాలా త్రిపురసుందరిదేవి అమ్మవారిని సూర్యకిరణాలు అభిషేకించాయి. మాఘ శుద్ధ పౌర్ణిమ బుధవారం ఉదయం 7 గంటల 35 నిమిషాలకు సుమారు 4 నిమిషాల 36 సెకన్ల పాటు ఆదిత్య కిరణాలు అమ్మవారిపై ప్రసరించా యి. ఉత్తరాయణం, దక్షిణాయనంలో అమ్మవారిని సూర్యకిరణాలు తాకడం ఏటా జరుగుతున్నట్లు ఈవో వెంకటసుబ్బారావు, ఆలయ అర్చకస్వామి వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



● కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

కిమ్స్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

● గుంటూరులో ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల కిందట నెల్లూరులో ఆస్పత్రి ఏర్పాటు ద్వారా వైద్యరంగంలో తన ప్రస్థానం ప్రారంభించిన కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ నేడు ఐదు రాష్ట్రాలకు విస్తరించి ఐదు వేల పడకలతో రోగులకు విస్తృత స్థాయిలో సేవలు అందించడం ప్రశంసనీయ మని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళదాస్‌నగర్ సమీపంలో 200 పడకలతో నిర్మించిన కిమ్స్ శిఖర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను బుధవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో కిమ్స్ ఆస్పత్రులు రోగులకు చక్కటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ఆస్పత్రిలో పని చేసే ఉద్యోగులకు షేర్ ఇచ్చారని తెలిపారు. పది వేల మంది ఉద్యోగులు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. సంస్థ బాగుండాలంటే అందులో పని చేసే ఉద్యోగుల భాగస్వామ్యం అవసరమేనన్నారు.

అమరావతిలో వెయ్యి పడకలతో ఆస్పత్రి..

రాజధాని అమరావతిలో త్వరలో వెయ్యి పడకలతో అత్యాధునిక ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు తెలిపారు. గుంటూరులోని హాస్పిటల్‌ను త్వరలో 500 పడకల సామర్థ్యానికి పెంచుతామన్నారు. విజయవాడలో కూడా అత్యాధునిక వసతులతో 500 పడకలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్‌యాదవ్, పొంగూరు నారాయణ, కింజరావు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, కందుల లక్ష్మీదుర్గేశ్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, మాలకొండయ్య, ధూమచర్ల జనార్ధన్, ఉగ్ర నరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సజీల, ఆస్పత్రి సీఈవో డాక్టర్ బీ అభినయ్, వైద్యనిపుణులు డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, డాక్టర్ పీపీఎస్ హరిత, డాక్టర్ కొల్లి జయ కిషన్, డాక్టర్ వడ్లమూడి సుధీర్, డాక్టర్ మాలెంపాటి రాజశేఖర్, డాక్టర్ రావెళ్ల విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పల్లె పండుగకు పైసలేవీ..!

పల్లె పండుగ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగడంలేదు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికి రూ 83.06 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రహదారులు.. మురుగు కాలువల నిర్మాణం.. గోకులాలు, పాఠశాలల ప్రహారీల నిర్మాణం తదితర పనులు నిధుల లేమితో నిలిచిపోతున్నాయి. దీంతో పనులు పూర్తి చేసేందుకు పల్లె కమిటీలు ముందుకు రావడంలేదు. పథకం ప్రారంభం లో వారం.. వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొద టి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరగడంతో పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగక పోతుండటంతో పనులను నిలిపివేస్తున్నారు.

- బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
- నిలిచిపోతున్న పనులు, నిర్మాణాలు
- రూ. 83.06 కోట్ల బకాయిలు
- రెండు నెలలుగా ఆగిన చెల్లింపులు

ప్రగతి పనులు.. గోకులం షెడ్ల బకాయిలు జిల్లాల వారీగా..

జిల్లా	రూ కోట్లలో
పల్నాడు	41.90
బాపట్ల	34.12
గుంటూరు	10.04

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీసం రోడ్లు, మురుగుకాలువలు వంటి మౌలిక సదుపాయలు కల్పించపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న దారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రారంభంలో ప్రగతి పనులు పరుగులు తీశాయి. అయితే పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగకపోవడంతో పనులకు ఎక్కడకక్కడ నిలిపివేస్తున్నారు. గుంటూరు.. బాపట్ల.. పల్నాడు జిల్లాల్లో పల్లె పండుగలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికి 57.95 శాతం పనులు మాత్రమే పూర్తయినట్టు డ్వామా శాఖ లెక్కలు చెబుతున్నాయి.

పల్నాడు జిల్లాలో రూ 62.44 కోట్ల వ్యయంతో గ్రామాల్లో రహదారులు.. మురుగు కాలువలు.. స్కూల్స్ ప్రహరీల నిర్మాణం 524 పనులు చేపట్టగా ఇప్పటికి 350 పనులు పూర్తి చేశారు. 66.67 శాతం పనులు పూర్తయినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. బాపట్ల జిల్లాలో 644 పనులు 67.67 కోట్ల వ్యయంతో చేపట్టగా 447 పనులు పూర్తయ్యాయి. 61.91 శాతం పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలో 170 పనులను రూ 14.54 కోట్ల వ్యయం తో చేపట్టగా ఇప్పటికి 77 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 45.29 శాతం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టు విధానంలో కాకుండా నామినేషన్ నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సూచించిన వ్యక్తుల చేత పనులు చేపట్టారు. ఈ విధానంలో దాదాపు 13 శాతం వరకు ప్రభుత్వానికి నిధులు ఆదా అవుతున్నాయి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోకులాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టిన అనంతరం నాలుగు విడతలుగా బిల్లులు చెల్లించాలి. పిల్లర్, రూఫ్, ఫ్లోరింగ్, ఫినిషింగ్ దశల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంది. లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు ఉపాధి పథకం కింద బిల్లుల మొత్తాన్ని జమ చేయాలి. సుమారు రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం స్లాట్ విడుదల కావడంలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో పనులు చేయించిన రైతులు ఉపాధి హామీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. బిల్లుల ఎప్పుడు చెల్లించేది స్పష్టంగా అధికారులు లబ్ధిదారులు చెప్పకపోతుండటంతో వారు ఆవేదనకు లోనవుతున్నారు. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్ల, గొర్రెలు, మేకలు పెంపకందారులు వారి వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం కల్పించారు. ఇటీవల ప్రజా ప్రతినిధులు పూర్తయిన గోకులం షెడ్‌లను ఆర్భాటంగా ప్రారంభించారు. అయినా బిల్లుల చెల్లింపులు జరగడంలేదు.

పల్నాడు జిల్లాలో 714 గోకులాలు మంజూరు కాగా 672 షెడ్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 458 షెడ్ల నిర్మాణం పూర్తయింది. వీటిలో 243 షెడ్లను ప్రారంభించారు. బాపట్ల జిల్లాలో 683 గోకులాలు మంజూరు కాగా 681 షెడ్‌ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 405 షెడ్ల నిర్మాణం పూర్తయింది. 222 షెడ్లను ప్రారంభించారు. గుంటూరు జిల్లాలో 386 షెడ్ల మంజూరు కాగా 379 షెడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 207 షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. 67 షెడ్లను ప్రారంభించారు. మిగతా షెడ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లించకపోతుండటంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు నిలిపివేస్తున్నారు. అధిక శాతం షెడ్లు 4 నుంచి ఆరు పశువుల యూనిట్ల నిర్మాణం చేపట్టారు. షెడ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. అప్పులు చేసి షెడ్‌లు నిర్మించుకున్నామని వెను వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులలో జాప్యంపై పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తిని సంప్రదించగా, పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని రానున్న వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు జరిగే అవకాశం ఉందని తెలిపారు.



గోకులం షెడ్



● మురుగు కాలువల నిర్మాణం



శిలాఫలకం దగ్గర సీఎం చంద్రబాబు, ఛైర్మన్ భాస్కరరావు తదితరులు

వైసీపీ పాలనలో...

అభివృద్ధికి నోచుకోని హాస్టల్స్

1కూటమి రాకతో పూర్వ వైభవమన్న మంత్రి గొట్టిపాటి



ఎస్సీ హాస్టల్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సంతమాగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో విద్యార్థులకు అందించే చిక్కీలు, బ్యాగుల మీద జగన్ బొమ్మలు వేసుకుని ప్రచారం చేయడం తప్ప హాస్టళ్ల అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్సీ హాస్టల్‌ను మంత్రి గొట్టిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతమాగులూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం ఒకప్పుడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండేదన్నారు. అలాంటి హాస్టల్ అభివృద్ధిని వైసీపీ విస్మరించిందన్నారు. 300 మందితో కళకళలాడే హాస్టల్ 30 మందికి తగ్గిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే పాఠశాలలు, హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మంత్రి గొట్టిపాటి చొరవతో రూ.35లక్షలతో హాస్టల్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బాలుర వసతి గృహానికి పూర్వవైభవం వచ్చింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేలప్రోలు రమేష్, చేవూరి వాసిరెడ్డి, పసుపులేటి కోటేశ్వరరావు, గుండపునేని సురేష్ పాల్గొన్నారు.

వలస పక్షులపై నిఘా

- బర్డ్ ఫ్లూ వదంతులతో పశుసంవర్ధకశాఖ అలెర్ట్
- ఉప్పలపాడు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు
- సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసే అవకాశం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేసులు లేవన్న అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వణికిస్తోంది. కోళ్లు పెద్దసంఖ్యలో చనిపోతున్నాయి. చికెన్ విక్రయాలపై అధికారులు నిషేధం విధించారు. కొన్ని జిల్లాల్లోని పలు ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరాను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తికి ప్రధాన వాహకంగా ఉన్న వలస పక్షులపై పశుసంవర్ధకశాఖ నిఘా వేసింది. వలస పక్షుల ద్వారా కూడా బర్డ్‌ఫ్లూ విస్తరించే అవకాశం ఉన్న నేపథ్యంలో గుంటూరు సమీపంలోని పక్షుల కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులు బుధవారం ప్రత్యేకంగా పరిశీలించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు, జిల్లా వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల ఏడీ బి.మాధవి తదితరులు వలస పక్షుల ఆరోగ్యంపై ఆరాతీశారు. పక్షులు తాగే నీటి వనరులను పరిశీలించారు. అక్కడ ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. వలస పక్షుల లో అసహజ మరణాలు సంభవిస్తే వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం గుంటూరులోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవన్నారు. అలా అని నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీలపై దృష్టి సారించాలన్నారు. అధికారులు పౌల్ట్రీలను సందర్శించి కోళ్ల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైతే జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరుకు వచ్చిన వలస పక్షుల వల్లే ఆ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిందని, దాని ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసులు లేవని ప్రకటించారు.

తగ్గిన కొనుగోళ్లు

గుంటూరు: పౌల్ట్రీ రంగాన్ని వణికిస్తున్న బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ ఉమ్మడి గుంటూరు జిల్లాపై ఎక్కడా లేదని, వదంతులను నమ్మొద్దని అధికారులు సూచిస్తున్నారు. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ వద్దంటూ ప్రజలు భయపడుతున్నారు. దాంతో కొనుగోళ్లు కూడా సగానికి పడిపోయినట్లు పౌల్ట్రీ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 2న ఆదివారం చికెన్ కిలో స్కిన్‌లెస్ రూ.250కు విక్రయించారు. బర్డ్ ఫ్లూ ప్రచారం ప్రభావంతో మొన్నటి ఆదివారం కిలో 200లకు పడిపోయింది. వారం వ్యవధిలోనే కిలోకు రూ.50 తగ్గి పోవడంతో వ్యాపారులు హైరానా పడుతున్నారు. గత నెలలో గరిష్ఠంగా కిలో రూ.270 వరకు విక్రయించగా ప్రస్తుతం చాలావరకు తగ్గిపోయింది అయినా కొనుగోళ్లు సగానికి సగం పడిపోయాయి.



ఉప్పలపాడు వలస పక్షుల కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తదితరులు

దిగి వస్తోన్న గుడ్డు ధర..

బర్డ్ ఫ్లూ ప్రచారం అంటుంచితే చికెన్‌తో పాటు కోడిగుడ్డు ధర కూడా దిగి వస్తోంది. గుడ్డు రూ.4.50 లకు చేరుకుంది. హోల్‌సేల్‌లో డిసెంబరు, జనవరిలో గరిష్ఠంగా రూ.6ల వరకు విక్రయించారు.



- బోర్డులు తిప్పేస్తోన్న సంస్థలు
- ఏడాదిలో నరసరావుపేటలో రెండు సంస్థల మూత
- కొరవడిన పర్యవేక్షణ.. రూ.కోట్లలో నష్టపోయిన మదుపరులు

చీట్.. ఫండ్స్





సాయిసాధన చిట్ కార్యాలయానికి తాళాలు వేస్తున్న పోలీసులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అత్యవసర సమయాల్లో.. కష్టకాలంలో అక్కరకు వస్తాయని.. సామాన్యులు, మధ్యతరగతి జీవులు తినీతినక చిట్లు వేస్తుంటారు. ఇదే అవకాశంగా మాయమాటలతో, వడ్డీల ఆశతో రూ.కోట్లలో పోగేసుకుని చిట్ సంస్థలు ఒక్కొక్కటిగా బోర్డు తిప్పేస్తున్నాయి. ఒక్క నరసరావుపేటలోనే ఏడాది కాలంలో రెండు చిట్ సంస్థలు మూతపడ్డాయి. చిట్‌ల సంస్థల నిర్వహణలో నష్టాలురావు. అయినా మదుపరుల నుంచి చిట్ పేరుతో డబ్బు వసూలు చేసుకుని ఉడాయిస్తున్నారు. గతంలో నరసరావుపేటలో సిరి, నేడు సాయిసాధన చిట్ సంస్థలు బోర్డు లు తిప్పేయగా చిట్ సభ్యులు దారుణంగా మోసపోయారు. రిజిష్టర్డు చిట్ సంస్థలుగా ఉన్న వీటిపై రిజిస్ట్రేషన్ శాఖ పర్యవేక్షణ లేదు. చిట్ సంస్థల నిర్వహణకు కఠినమైన చట్టం ఉన్నా దానిని అమలు చేయడం లేదు. అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కు కావడంతో మదుపరులను నిర్వాహకులు మోసగిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

రిజిష్టర్డు సంస్థలు రూ.10 లక్షల చిట్ నిర్వహిస్తే చట్టప్రకారం (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేటలో సాయిసాధన బాధితుల అందోళన

వందల్లో సాయిసాధన బాధితులు

సాయిసాధన చిట్ సంస్థ నిర్వహకుడు పాలడుగు పుల్లారావు వందలాది మంది సభ్యులను రూ.కోట్లలో మోసగించాడు. గుంటూరు, నరసరావుపేట పోలీసు స్టేషన్లలో బాధితుల ఫిర్యాదుల మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో పుల్లారావు లొంగిపోగా ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. ప్రాథమికంగా తేల్చిన లెక్కల ప్రకారం 323 మంది నుంచి రూ.103,95,49,582 డిపాజిట్లు ఉన్నాయి. వీరు కాక మోసపోయిన చిట్ సభ్యులు కూడా వందల్లో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. పుల్లారావు భార్య కూడా సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారు. 2021 నుంచి పథకం ప్రకారం డిపాజిట్లు స్వీకరిచడంతో పాటు.. అక్రమంగా చిట్లు నిర్వహించి మోసగించినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితులు గత వారం రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. పుల్లారావుతో పాటు ఆయన కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల,. బంగారు వస్తువులు విక్రయించి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను బాధితులు కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

16న జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

హాజరు కానున్న మంత్రి రవికుమార్, సినీనటుడు సుమన్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌బీ డ్రాగన్స్ షటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన స్థానిక గీతామందిర్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ కరాటే కుంగ్‌ఫు, టైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని పోటీల చీఫ్ ఆర్గనైజర్ పీ రాంబాబు తెలిపారు. బుధవారం స్థానిక చిన్ని మురళీ కృష్ణ ఆఫీస్‌లో పోటీలకు సంబంధించి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతు ఈ పోటీలకు 8 రాష్ట్రాల నుంచి సుమారు 700 మంది పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సినీ హీరో సుమన్ హాజరవుతారని తెలిపారు. అసోసియేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ జి.సాయిరాం ఇతర అధికారుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అద్దంకిలో 40 సంవత్సరాల కిందట కరాటే మాస్టర్‌గా ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు జాతీయ స్థాయి చీఫ్ ఆర్గనైజర్ స్థాయికి చేరి, ప్రస్తుతం తన స్వస్థలం అద్దంకిలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయం అని కరాటే రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని మురళికృష్ణ అన్నారు. ఈ పోటీలను విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కరాటే మాస్టర్ వెంకటరత్నం, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని వింధ్యావాసిని సమేత నగరేశ్వరస్వామి దేవాలయం (వేయి స్తంభాలగుడి)లో సప్తమ కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. సోమవారం నుంచి ప్రారంభమైన సప్తమ కల్యాణ ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పూజారి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హజరై శివపార్వతుల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో అజయ్‌బాబు

చినగంజాం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్న పాఠశాలలో ఆ సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు, పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మన్లు కృషి చేయాలని తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై ప్రభుత్వం చేపట్టిన నూతన కార్యక్రమంపై పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యా కమిటీ ఛైర్మన్‌లకు బుధవారం మండల విద్యాశాఖాధికారి-1 అజయ్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నూతన కార్యక్రమంలో భాగంగా తరగతిగదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రైమరీ మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. మండలంలో ఇప్పుడు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 37ఉండగా, అవి 38కి పెరిగినట్లు తెలిపారు. మండల పరిదిలో 12 మోడల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రణాళికలను తయారు చేసి ఉన్నాతాధికారులకు పంపినట్లు తెలిపారు. సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుండి ఒక కిలోమీటరు దాటి పాఠశాలలో చేరిన విద్యార్థికి ప్రభుత్వం సంవత్సరానికి విద్యార్థి బ్యాంకు అకౌంట్లో ఆరు వేలరూపాయిలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అద్దంకి శ్రీనివాసమూర్తి, మండల పరిధిలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్‌లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగర పంచాయతీ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 1వ వార్డులో ఆయన కమిషనర్ మహేశ్వరరావుతో కలిసి బుధవారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత వాసులు గృహాల మీదుగా వెళ్తున్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. మురుగుకాల్వలు, సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. వెంటనే ఛైర్మన్ పిచ్చయ్య విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గృహాలపై వేలాడుతున్న విద్యుత్ తీగలను తొలగించాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో సీసీరోడ్లు, కాల్వలు నిర్మించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్

మూడు యూపీ స్కూళ్లు మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా ప్రతిపాదనలు

ముండ్లమూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ మండల విద్యా శాఖ అధికారులు జిల్లా అధికారులకు పంపిన ప్రతిపాదనలను ఆమోదించారు. సింగనపాలెం, పెదఉల్లగల్లు, సుంకరవారిపాలెం, శంకరాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా మారుస్తున్నారు. అదేవిధంగా వేములబండ, తూర్పుకంభంపాడు, నాయుడుపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మారుస్తూ ప్రతిపాదనలను పంపించారు. వీటికి జిల్లా కలెక్టర్ ఆమోదముద్ర కూడా వేశారు. ఇక కేవలం విద్యా శాఖ కమిషనర్ ఉత్తర్వులే వెలువడాల్సి ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి యూపీ పాఠశాలలుగా కొనసాగుతుండటంతో విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి విద్యను అభ్యసిస్తున్నారు. ఇటీవల యూపీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి హైస్కూళ్లుగా మార్చేందుకు విద్యా శాఖ మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు వాటి ఫైళ్లు వేగంగా కదిలాయి. దీంతో వచ్చే విద్యా సంవత్సరానికి ఆ పాఠశాలలు హైస్కూళ్లుగా మారనున్నాయి. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ఆ పాఠశాలలను రద్దు చేస్తూ వాటి స్థానంలో మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు చేస్తున్నారు. దీంతో యూపీ పాఠశాలలు హైస్కూళ్ళుగా ఏర్పాటు కానుండటంతో ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

మట్టిరోడ్లకు మోక్షం

ఎమ్మెల్యే ఏలూరి కృషితో

ద్రోణాదుల, ఇడుపులపాడు అభివృద్ధి పనులు

మార్టూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో మట్టిరోడ్డు తారు రోడ్డుగా నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కానీ రోడ్డు పనులను ప్రారంభిస్తే బిల్లులు వస్తావో, రావో అనే భయంతో పనులు చేయడానికి కాంట్రాక్టరు ఆసక్తి చూపలేదు. అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భరోసాతో కాంట్రాక్టరు ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామం నుంచి ఇంకొల్లు మండలం ఇడుపులపాడు గ్రామం వరకు తారురోడ్డుతో పాటు, రెండు గ్రామాలలో అంతర్గతంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన క్రింద 3.53 కోట్లు రూపాయలు నిధులు మంజూరయ్యాయి. గత ఏడాది 2024న జనవరిలో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయి. సంబంధిత టెండర్ల దశ కూడా ముగిసింది. కానీ కాంట్రాక్టరు రోడ్డు పనులను మొదలెట్టలేదు. పర్చూరు నియోజకవర్గంలో ప్రాధాన్యత కలిగిన పాత మద్రాసు రోడ్డు (స్టేట్‌హైవే) నుంచి మార్టూరు మండల పరిధిలో ఉన్న జొన్నతాళి రోడ్డు (నేషనల్‌హైవే) వరకు ప్రయాణం సులభతరంగా ఉంటుందనే ఆలోచనతో ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు గ్రామాల మధ్య 5.630 కిమీ దూరం ఉంది. ప్రస్తుతం సగం పనులకు పైగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి.మార్చి 15వ తేదీలోపు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.



ద్రోణాదుల, ఇడుపులపాడు గ్రామాల మధ్య కొంతదూరం వేసిన తారు రోడ్డు



చకచకా సాగుతున్న రోడ్డు పనులు

రోడ్డుపనులు జరుగుతుండడంతో ప్రజల ఆనందం

ద్రోణాదుల - ఇడుపులపాడు గ్రామాల మధ్య నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణం ఈ రెండు గ్రామస్థులకే కాకుండా మిగిలిన గ్రామాల ప్రజలందరికీ కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఎన్నో ఏళ్ల నుంచి రోడ్డు నిర్మాణానికి చాలా మంది కృషి చేసినప్పటికీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహాయ సహకారాలతో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా జరగడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ద్రోణాదుల గ్రామం నుంచి చీరాల, వేటపాలెం పట్టణాలకు వెళ్లడానికి ప్రజలకు ఈ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. అదేవిధంగా పర్చూరు, ఇంకొల్లు మధ్య పాత మద్రా సు రోడ్డు నుంచి త్వరితంగా ఇడుపులపాడు, ద్రోణాదుల, చిమ్మిరిబండ, రాజుగారిపాలెం గ్రామాల మీదుగా 216 జాతీయ దారి జొన్నతాళి రోడ్డు చేరడానికి ప్రజలకు సులభంగా ఉంటుంది. అన్నింటికన్నా ద్రోణాదుల, ఇడుపులపాడు గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఈ రోడ్డు పక్కనే ఉన్నాయి. దాంతో పంటల సాగు సమయంలో, ఇతరత్రా వ్యవసాయపనులు సమయంలో ఈ రహదారి రైతులకు ఎంతో అనువుగా ఉంటుంది. త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత మార్టూరు నుంచి ద్రోణాదుల మీదుగా ఇంకొల్లు, పర్చూరు, చీరాల, వేటపాలెం తదితర పట్టణాలకు రవాణా సులభతరం కానుంది.



శింగరకొండలో లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం లో బుధవారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా జరిగింది. మాఘ పౌర్ణమి సందర్భంగా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సు ప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించారు.అభిషేకం అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములు గా లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉభయదాతలు గా అద్దంకికి చెందిన కోనేటి వెంకటేశ్వర్లు, కుమారి, కళ్యాణ్, కళ్యాణి దంపతులు పాల్గొన్నారు. ఉభయదాతలను వేదపండితులు,పూజారులు ఆశీర్వదించారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

- ఒక్క సర్పంచ్ కూడా హాజరుకాని వైనం
- అధికారులకు నోటీసులిస్తాం ఎంపీడీవో



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రజని, ఎంపీడీవో లక్ష్మీనారాయణ తదితర అధికారులు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండల సర్వసభ్య సమావేశం బుధవారం యద్దనపూడి మండల పరిషత్ కార్యాలయంలో మొక్కుబడిగా జరిగింది. సమావేశం జరిగేందుకు సరిపడా ఎంపీటీసీ సభ్యులు సభకు హాజరైనప్పటికీ మండలంలో ఉన్న 14 గ్రామాల సర్పంచ్‌లలో ఒక్కరు కూడా హాజరుకాలేదు. దాంతో గ్రామాలలో ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించేవారే లేరు. కొంతమంది వివిధ శాఖలకు అధికారులు కూడా సమావేశానికి డుమ్మాకొట్టారు. సమావేశానికి హాజరుకాని మండల అధికారులకు నోటీసులు జారీ చేస్తామని ఎంపీడీవో లక్ష్మీ నారాయణ తెలిపారు. ఇదిలావుండగా సమావేశానికి ఎంపీపీ పులగం రజని అధ్యక్షత వహించగా, మండల స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ హాజరయ్యారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ జాగర్లమూడి ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను ఏర్పాటుచేసి కాలనీ వాసులకు తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. అంతేగాకుండా తాగునీటి సమస్య ఉన్న గ్రామాల వివరాలను తెలియచేయాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. యనమదల గ్రామంలో ఎస్‌సీ, ఎస్‌టీ కాలనీలో సైడు కాల్వలు, సిమెంటు రోడ్లు తదితర సమస్యలను తెలుసుకునేందుకు సర్వే చేసేందుకు ఎంపిక చేశామన్నారు. ఇంకా సమావేశంలో తహసీల్దారు కె రవికుమార్, ఎంఈవో గోపి, ఐసీడీఎస్ సీడీపీవో సుభద్ర తదితర అధికారులు హాజరయ్యారు.

తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు తుది నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని సత్రం బడిని యూపీ పాఠశాలగా కొనసాగింపు, డౌన్‌గ్రేడ్‌గా చేసి మోడల్ ప్రాథమిక పాఠశాలగా చేసే విషయంపై తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఎంఈవో1 గంగాధరరావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం అప్ గ్రేడా..డౌన్ గ్రేడా అనే కథనం ప్రచురితం కావడంతో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమీపంలో ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నందున సత్రం బడిలో 6, 7 తరగతులు చదువుతున్న 33 మంది విద్యార్థులను ఆయా హైస్కూల్స్‌లో చేర్పించి, మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రాథమికంగా నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్పు చేస్తే 5 తరగతులకు 5 గురు ఉపాధ్యాయులను కేటాయించే అవకాశం ఉందన్నారు. యూపీ పాఠశాలగా కొనసాగిస్తే విద్యార్థుల సంఖ్య 90 మంది మాత్రమే ఉన్నందున 1 నుంచి 8 తరగతులకు 4గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని మోడల్ స్కూల్‌గా ప్రతిపాదించడం జరిగిందని, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించండి

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటసాగులో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని చినమల్లవరం, పంగులూరు గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సాగులో ఉన్న శనగ, పొగాకు పంటలను పరిశీలించారు. శనగలో తుప్పు తెగులు నివారణ చర్యలు చేట్టాలని సూచించారు. భూ యజమానులకు ప్రభుత్వం 14 నెంబర్లతో కూడిన యూనిక్ ఐడీని ఇవ్వనున్నందున రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు గుర్తింపు నెంబరు పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శైలేష్, నవనీతం, అమృత, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : రైతులకు ఆధార్ కార్డులాగే 14 అంకెలతో కూడిన యూనిక్‌ఐడిని అందిస్తామని మార్టూరు ఎడిఏ కెవి శ్రీనివాసరావు అన్నారు.ఆయన బుధవారం మండలంలోని బొబ్బేపల్లి,రాజుగారిపాలెం గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ తో కూడిన పథకాలను అందించాలంటే ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకోవాలన్నారు.తద్వారా వారు ప్రభుత్వ పథకాల లబ్దిపొందడానికి అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంజిరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : పొలం ఉన్న ప్రతి రైతు గుర్తింపు కార్డును తీసుకోవాలని పర్చూరు వ్యవసాయ సహాయ సంచారకుడు ఎన్. మోహనరావు అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్చూరు, ఉప్పుటూరు గ్రామాల్లోని రైతులకు ఎవో రామోహన్ రెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ పొలం ఉన్న రైతు విశిష్ట ఐడీ కార్డు తీసుకోవాలన్నారు. ఐడీ గుర్తింపు ఉన్న కార్డు దారులకు మాత్రమే వ్యవసాయ పథకాలు, రాయితీలు అందుతాయన్నారు. ఏవో రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పంట మార్పిడి విధానాన్ని అనుసరించకపోవడంవల్లే తెగుళ్ల సోకుతున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అర్హులైన రైతులకు రాయితీపై బిందు, తుంపర సేద్య పరికాలు అందిస్తున్నమని అవసరమైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఉద్యాన శాఖ అధికారి ఎస్.దీప్తి అన్నారు. బుధవారం పట్టణం పరిధిలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు గుర్తింపు సంఖ్య తప్పని సరి అని, ప్రతి ఒక్కరు గుర్తింపు సంఖ్య కోసం సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీపీఏ శేషారావు పాల్గొన్నారు.

ఏబీసీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు



అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో వల్లాపల్లి సమీపంలో ఎన్ఎస్‌పీ కాలువపై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

అద్దంకి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కెనాల్(ఏబీసీ) పై శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి స్థానంలో కొత్తగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రోడ్డు రవాణా, భవనాల శాఖ నుండి 2 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్ అండ్ బి రోడ్డు లో వల్లాపల్లి సమీపంలో అద్దంకి బ్రాంచి కెనాల్ పై సుమారు 6 దశాబ్దాల క్రితం నిర్మించిన బ్రిడ్జి పూర్తి గా శిథిలావస్థ కు చేరింది. డబుల్ రోడ్డు గా విస్తరణ జరిగినప్పటికి బ్రిడ్జి వద్ద మా త్రం సింగిల్ వే గా ఉండటం తో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక దృష్టి సారించి ఆర్‌అండ్‌బి శాఖ నుండి నిధులు మంజూరు చేయించారు. దీంతో అద్దంకి, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు మండలాల ప్రజలకు కష్టాలు తీరనున్నాయి.ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు

గుంతలు పూడ్చుతున్న అధికారులు

దర్శి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా రోడ్లను గుంతలరహితంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే అధికశాతం రోడ్లకు మరమ్మతులు పూర్తయ్యాయి. కొన్నింటికి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని అసలు పట్టించుకోకపోవటంతో అన్నిరోడ్లు అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. రాకపోకలకు ఇబ్బందిగా మారి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్లలో ఉన్న గుంతలను చదును చేసి నునుపుగా తీర్చిదిద్దుతున్నారు.

మండలంలోని తొమ్మిది ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. 65 కిలోమీటర్లు దూరం గుంతలు పూడ్చి, కంకర, తారు వేసి అభివృద్ధి చేసినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. ఈ పనులకు ఇప్పటి వరకు రూ.80 లక్షలు ఖర్చుచేశారు.

చీట్‌ఫండ్స్

(5వ పేజీ తరువాయి)

చిట్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయాలి. అనుమతులు వచ్చాకే చిట్ నిర్వహించాలి. ఎంత చిట్‌ను నిర్వహిస్తే అంత మొత్తం డిపాజిట్.. లేదా బ్యాంక్ గ్యారంటీ దాఖలు చేయాలి. ప్రతి చిట్‌కు మూడు బ్యాంకు ఖాతాలను నిర్వహించాలి. చిట్ పొందిన సభ్యుడికి 25 రోజుల్లో బ్యాంకు ఖాతా ఒకటి నుంచి డబ్బు చెక్కు రూపంలో చెల్లించాలి. సభ్యుడు నిర్ణీత గడువులోపు డబ్బు స్వీకరించకపోతే ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంచాలి. ఏ నెలలో ఏ సభ్యుడు చిట్ పొందాడన్న వివరాలను చిట్ రిజిస్ట్రార్‌కు లిఖిత పూర్వకంగా తెలియపరచాలి. ఒక నెలలో ఇందుకు సంబంధించిన సమాచారం ఇవ్వని పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు లేని పక్షంలో డిపాజిట్ సొమ్మును చిట్ ముగిసిన తర్వాత సంస్థకు చెల్లించాలి. చిట్ సంస్థపై ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. లోపాలు ఉంటే చర్యలు తీసుకోవాలి. చిట్ సంస్థలపై రిజిస్ట్రేషన్‌శాఖలోని రిజిస్ట్రార్ పర్యవేక్షణ ఉండాలి. ప్రతి నెల సంస్థ సంబంధిత పత్రాలను దాఖలు చేస్తుందీ లేనిది పరిశీలించాలి. సభ్యులకు డబ్బు చెల్లింపులు ఎలా జరుగుతున్నాయన్న అంశాన్ని పరిశీలించాలి. అయితే ఈ నిబంధనలు ఏవీ ఎక్కడ కూడా అమలు కావడంలేదు. నరసరావుపేటలో ఓ చిట్ సంస్థ కాలపరమితి పూర్తయిన మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకపోవడంతో లేదు. వైద్యుడిగా ఉన్న ఆ సభ్యుడు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా సంస్థపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

భారీగా లాభాలు

ప్రతి గ్రూప్ చిట్‌కు మొదటి నెల, మూడో నెల పాటను సంస్థ తీసుకుంటుంది. ప్రతి నెల 5 శాతం కమీషన్ వసూలు చేస్తోంది. ఉదాహరణకు 10 లక్షల చిట్‌కు రెండు నెలలకు రూ.20 లక్షలను సంస్థ తీసుకుంటుంది. ప్రతీ నెల కమీషన్ రూపంలో నెలకు రూ.50 వేలు వసూలు చేస్తుంది. రూ.10 లక్షల చిట్‌కు మొత్తంగా రూ.30 లక్షలు చిట్ సంస్థకు వస్తుంది. ఇంత భారీగా లాభాలు వస్తున్నాయి. ఒక సభ్యుడు 2వ నెల చిట్ పొందినట్లయితే ముగ్గురు వ్యక్తుల గ్యారంటీతో చిట్ సొమ్ము చెల్లిస్తారు. ఇక వేళ చిట్ తీసుకున్న సభ్యుడు నెలవారీగా సొమ్ము చెల్లించకుంటే గ్యారంటీ ఇచ్చిన వక్తుల నుంచి ఆ మొత్తాన్ని రాబట్టుకుంటారు. ఏ కోణంలో చూసినా చిట్ సంస్థకు నష్టాలు వచ్చే అవకాశం లేదు. అయినా రిజిష్టర్ పేరుతో అక్రమంగా చిట్లు నిర్వహిస్తూ మదుపరులను మోసగిస్తున్నారు. చిట్ సంస్థలు బోర్డు తిప్పేస్తుండటంతో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చిన్నతరహా నీటి వనరుల గణనపై శిక్షణ

పర్చూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చిన్నతరహా నీటి వనరులు, జలాశయాల గణనపై బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి వనరులను ఏవిధంగా గణన చేయాలి, ప్రస్తుతం ఉన్న నీటి వనరుల పరిస్థితి తదితర అంశాలపై తహసీల్దార్ బ్రహ్మయ్య నేతృత్వంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. పర్చూరు, యద్దనపూడి మండలాల పరిధిలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వీవీఎస్ కమలాకర్, డిప్యూటీ తహసీల్దార్ పి.సుధారాణి, ఏఎస్‌వో శ్రీమన్నారాయణ, ప్రేమకుమారి, వీఆర్వోలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి కమలాకర్, తహసీల్దార్ బ్రహ్మయ్య

లక్షలు వ్యయం.. అన్నీ నిరుపయోగం

- చీరాల నియోజకవర్గంలో పెద్దఎత్తున నిలిచిన ప్రభుత్వ భవనాలు
- బిల్లులు రాక కొన్ని, ప్రారంభం కాక కొన్ని
- సేవలు లేక మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- అందుబాటులోకి తేవాలని ప్రజల విజ్ఞప్తి





బిల్లులు రాక స్వల్ప పెండింగ్‌లతో నిలిచిన బోయినవారిపాలెం రైతు సేవా కేంద్రం... వినియోగంలో లేని దేవాంగపురి-2 సచివాలయం, దేవాంగపురి రైతు సేవా కేంద్రం

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో అరకొర నిర్మాణాల పెండింగ్‌తో కొన్ని, ప్రారంభానికి నోచుకోక కొన్ని ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అత్యవసర సేవలంటూ, ప్రజల వద్దకే పాలనంటూ ఊదరగొట్టే ప్రచారాలతో గత ప్రభుత్వం ప్రజా సొమ్మును ఇష్టారీతిగా దుర్వినియోగం చేసింది. ఈక్రమంలోనే కాంట్రాక్టర్‌లకు భవనాల ఆశచూపి పనులు ప్రారంభించే విధంగా ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో శ్రద్ధ కనబరచలేదు. అయితే వైసీపీ పాలకుల కల్లబొల్లి మాటలు నిజమని నమ్మిన కాంట్రాక్టర్‌లు వడ్డీలకు అప్పులు తెచ్చిమరీ భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. ఈక్రమంలో కొందరయితే బేస్‌మెంట్ లెవల్లోనే చేతులు దులుపుకోగా, మరి కొందరు దాదాపుగా భవనాలనుపూర్తి చేశారు. అయితే అప్పట్లో కొందరికి బిల్లులు రాకపోవడంతో అధికారులకు తాళాలు ఇవ్వలేదు. మరి కొందరికి 5దశల్లో బిల్లులు రావాల్సి ఉండగా, రెండు దశల్లోనే ఆగిపోయాయి. దీంతో దాదాపుగా పూర్తయిన సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. చుట్టూ చిల్లచెట్లు, పిచ్చి మొక్కలతో అస్థవ్యస్థంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల భవనాలు మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు ఆవాసాలుగా మారాయి. భవనాల చుట్టూ చెత్తా చెదారాలు వివిధ రకాల వ్యర్థాలతో దారుణంగా కన్పిస్తున్నాయి. మరోవైపు కాంట్రాక్టర్‌లకు వడ్డీలు పెరిగి పోయి, బిల్లులు రాకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

టీడీపీ కూటమి ప్రభుత్వమైనా బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కాంట్రాక్టర్‌లు వేడుకొంటుండగా, భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



పూజలకు హాజరైన టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహేంద్రనాథ్

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి వేణు గోపాల స్వామి దేవస్థానంలో పొగడదండ రవికుమార్ దంపతులచే శాంతి కల్యాణ హోమం నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ హాజరయ్యారు. ఈక్రమంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి మహేంద్రనాథ్‌కు ఆశీస్సులు అందించారు. చీరాల యాదవపాలెంలో శ్రీ తిరుపతమ్మ గోపయ్య స్వామి 34వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మహేంద్రనాథ్ పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండ మంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన పంచుమర్తి రాంబాబు బీరువాను బహూకరించారు. ఇదే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న పంచుమర్తి రాంబాబు కుమార్తె భవ్యశ్రీ పోస్టర్ కాంపిటేషన్‌లో దేశస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి గ్రామానికి, పాఠశాలకు పేరు తెచ్చింది. భవ్యశ్రీ తండ్రి రాంబాబు బుధవారం బీరువాను హెచ్‌ఎం అనితకు అందచేశారు. రాంబాబును ఉపాధ్యాయులు అభినందించారు.

చెత్త సంపద కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



వల్లాపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వల్లాపల్లి గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని ఎంపీడీవో కె.కుసుమకుమారి బుధవారం పరిశీలించారు. గ్రామానికి పరమడ వైపున ప్రభుత్వ భూమిలో చెత్త సంపద కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని గ్రామ పెద్దలు ఎంపీడీవోకి తెలియజేశారు. దీనిపై ఆమె స్థలాన్ని పరిశీలించి త్వరలో చెత్త సంపద కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలు లేని బల్లికురవ, చెన్నుపల్లి, కూకట్లపల్లి, వల్లాపల్లి గ్రామాలలో స్థలాలను సేకరించి వెంటనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి అనిల్ పాల్గొన్నారు.



గుండెపోటు నివారణ ఇంజక్షన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శరత్‌కుమార్, వైద్యాధికారులు

ఉచితంగా గుండెపోటు నివారణ ఇంజక్షన్

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వైద్యశాలలో మెరుగైన సేవలు అందించడంలో భాగంగా వేల రూపాయలు విలువ చేసే గుండె పోటు నివారణ ఇంజక్షన్‌ను ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా అందిస్తుందని దానిని రోగులు సద్వినియోగపర్చుకోవాలని సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ డి.శరత్‌కుమార్ అన్నారు. బుధవారం అద్దంకి సీహెచ్‌సీలో గుండెపోటు నివారణ ఇంజక్షన్‌కు సంబంధించి స్టెమీ గుండెకు భరోసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గుండెపోటు వచ్చే లక్షణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ శరత్‌కుమార్ వివరించారు. ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. మొదటి గంట అత్యంత కీలకమని, ఇలాంటి లక్షణాలు ఉన్న వారిని 108 అంబులెన్స్ సాయంతో మొదటి గంట లోపు దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు తిసుకురావడం, ప్రథమిక పరీక్షల అనంతరం రూ.45వేల విలువైన ఈ ఇంజక్షన్‌ను రోగికి అందించి ప్రాణాలు కాపాడుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అనిత జ్యోతి, డాక్టర్ డి.ప్రదీప్తి, డాక్టర్ జి.మెర్సీ పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను అతివేగంగా నడిపితే చర్యలు

ఆర్టీవో రామకృష్ణారెడ్డి



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఆర్టీవో రామకృష్ణారెడ్డి, సిబ్బంది

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు అతివేగంగా పాఠశాలల సమీపంలో నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చీరాల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన పాఠశాలల వద్ద ప్రమాద ఘంటికలు కథనంపై ఆయన స్పందించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పలు పాఠశాలల వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. అలాగే వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈక్రమంలో మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. అలాగే కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట తనిఖీ అధికారులు అంకమ్మరావు, కిషోర్‌బాబు, రవి నాయక్, సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలిసిన బులియన్ మర్చంట్ ప్రతినిధులు

అదుపులో ఉన్న వ్యాపారికి తాత్కాలిక ఊరట

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం చీరాల బంగారపు వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయమై చీరాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎస్పీ తుషార్‌డూడీని కలిశారు. ఈక్రమంలో తమ వ్యక్తిని అదుపులోకి తీసుకున్న విషయాన్ని వివరించారు. దీంతో స్పందించిన ఎస్పీ స్థానిక అధికారులతో విషయంపై ఆరా తీశారు. ఈక్రమంలో బంగారం వ్యాపారి దేవకర్ శ్రీరంగవేల్‌కు తాత్కాలిక ఊరట లభించింది. అయితే సుమారు 14 కేసుల్లోని నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసుల విచారణ జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఆ కేసుల వెనుక ప్రముఖులను విచారణ చేయనున్నట్లు తెలుస్తోంది.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

సంతమాగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సంతమాగులూరు ప్రాజెక్టు పరిధిలోగల అంగన్‌వాడీ కార్యకర్తలు 13 నుంచి 15వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సంతమాగులూరు ప్రాజెక్టు అధికారి సుధ తెలిపారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు, బల్లికురవ మండలం కొప్పెరపాడు జడ్పీ హైస్కూల్‌లో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు ఉంటాయని సుధ తెలిపారు.

వినియోగంలోకి గుంటుపల్లి ఎత్తిపోతల

- మంత్రి రవికుమార్ ఆదేశాలతో చోరీ అయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న మూడు గ్రామాల రైతులు



మరమ్మతులు అనంతరం వినియోగంలోకి వచ్చిన గుంటుపల్లి ఎత్తిపోతల పథకం

బల్లికురవ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : గత రెండేళ్ల నుంచి మరమ్మతులకు గురై ఉన్న గుంటుపల్లి ఎత్తిపోతల పథకం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కృషితో ఎట్టకేలకు బుధవారం నుంచి వినియోగంలోకి వచ్చింది. రెండేళ్లగా నిరుపయోగంగా ఎత్తిపోతల పథకం ఉండడంతో పంటలకు సకాలంలో నీరు అందడం లేదు. దీంతో ఇటీవల నీటి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన డీసీ వైస్ చైర్మన్ కోయ పేరయ్యను ఎత్తిపోతల పథకాన్ని వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరారు. దీంతో అయన ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించగా అందులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయి ఉంది. మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ విషయాన్ని పేరయ్య మంత్రి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. పథకంలో మరమ్మతు లు చేసి నీటిని పంటలకు విడుదల చేస్తున్నారు. ఎంతో కాలంగా పనిచేయని ఎత్తి పోతల పథకం కూటమి ప్రభుత్వం రాగానే వినియోగంలోకి తీసుకురావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ గ్రామాలలో ఉన్న 12 వందల ఎకరాల భూములను నీరు అందుతుందని మొక్కజొన్నను రైతులు సాగు చేసి ఉన్నారని ఇప్పుడు పథకం వినియెగంలోకి రావడం పంటలకు ఉపయోగమని రైతులు అంటున్నారు.



కాలవలోకి వచ్చి చేరుతున్న ఎత్తిపోతల నీరు

భక్తిశ్రద్ధలతో సాగరహారతి

వాడరేవు(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు సముద్ర తీరంలోని ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో బుధవారం రాత్రి హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సాగర హారతిని ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు విశేషంగా హాజరయ్యారు. కార్యక్రమంలో తాడివలస దేవరాజ్, జ్వాలా నరసింహం, వేద పండితులు కార్తీక్ శర్మ, నగేష్, సంగ్ రాష్ట్ర నాయకులు అవ్వారు శ్రీనివాసరావు, ఆంజనేయశర్మ, నాగేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సాగర హారతిని ఇస్తున్న పురోహితుడు



స్టాకు వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి, డీటీ గీత

రైస్ డిపోలపై కొనసాగుతున్న దాడులు

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండల పరిధిలోని అధికారులు రెండో రోజు రైస్ డిపోలపై దాడులు నిర్వహించారు. ఈక్రమంలో తహసీల్దార్ పార్వతి, సివిల్ సప్లయిస్ డీటీ గీత 13, 15 షాపులను తనిఖీ చేశారు. స్టాకు సక్రమంగా ఉన్నట్లు చెప్పారు. తరచూ దాడులు జరుగుతాయని, భిన్నంగా వ్యవహరిస్తే కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ఎండీ మొయిన్

నిబంధనల మేరకు రిసార్ట్స్ నిర్వహించాలి

డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాలటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు మాత్రమే రిసార్ట్స్ నిర్వహించాలని చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ అన్నారు. బుధవారం సముద్ర తీరంలోని రిసార్ట్స్ యజమానులు, నిర్వాహకులతో రూరల్ సీఐ శేషగిరిరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కచ్చితంగా గజ ఈతగాళ్లతో నిర్వహణ సాగాలన్నారు. ప్రమాదాలు నియంత్రించాలంటే గజ ఈతగాళ్ల సాయం అవసరం ఉందన్నారు. అలాగే అనుమతులు లేకుండా క్యాంప్ ఫైర్ వంటివి నిర్వహించరాదన్నారు. రూములకు వచ్చిన వారి నుంచి అడ్రస్ ప్రూఫ్‌లు తప్పనిసరిగా సేకరించాలన్నారు. అనుమానుతుల వివరాలను వెంటనే అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రిసార్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రేపు బూదవాడలో ఉచిత నేత్రవైద్య శిబిరం

పంగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూదవాడ గ్రామంలో ఈ నెల14న ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ నేత కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గొట్టిపాటి యా త్ ఆధ్వర్యంలో కారంచేడు ఎల్‌వీ ప్రసాద్ నేత్రాలయం వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షకు వచ్చే వారు ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని కోరారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

- గ్యాస్ సిలిండర్ పేలడంతో ఎగిసిపడిన మంటలు
- బూడిదైన నగదు, బంగారు ఆభరణాలు
- కారంచేడు మండలం ఆదిపూడిలో ఘటన



మంటల్లో కాలిపోతున్న ఇల్లు



కాలి బూడిదైన నగదు

ఆదిపూడి (పర్చూరు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన కారంచేడు మండలం ఆదిపూడి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మిరియాల శివమ్మ ఇంట్లో ఉదయం 9గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న గ్యాస్‌సిలిండర్ కూడా పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదం జరిగిన సమయానికి శివమ్మ పొలానికి వెళ్లగా, ఆమె తల్లి మరో చోటుకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న చీరాల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న పొలానికి వెళ్లిన మహిళ బూడిదైన ఇంటిని చూసిన బోరున విలపించింది. ఇంట్లో సామగ్రితోపాటు దాచుకున్న రూ.50వేల నగదు, 5 సవర్ల బంగారు ఆభరణాలు కాలిపోయాయని ఆమె కన్నీరుమున్నీరుగా విలపించింది. సుమారు రూ.5లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగి ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు వంటపాత్రల అందజేత

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాయపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్) వంటశాలకు అవసరమైన వంట సామగ్రిని బుధవారం అందజేశారు. రిటైర్డ్ హెచ్‌ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతుల రెండవ కుమారుడు తాండవకృష్ణ కుమార్తె మాహిమాన్విత పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకానికి అవసరమైన గ్యాస్ స్టవ్, పెద్ద వంట పాత్రను హెచ్‌ఎంపురుషోత్తంకు దాతలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఎస్ఎస్ తార, ఎం. కోటేశ్వరరావు, కృష్ణరావు, ఎస్ఎంసీ బాధ్యులు పరిటాల నాగరాజు, సీఆర్పీ ఎం.రమేష్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సంతమాగులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విత్తన వ్యాపారం సాగక, అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొమ్మలపాడు గ్రామం వద్ద బుధవారం చోటుచేసుకుంది. అద్దంకి పట్టణం పనుమర్తిపాలెంకు చెందిన సిద్ధారపు సుబ్బారెడ్డి (50) అద్దంకి టౌన్‌లో విత్తనాల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం సాగక, అప్పులు ఎక్కువై మనస్థాపం చెంది, అద్దంకి నుంచి కొమ్మలపాడు గ్రామం కాలువ వద్దకు వచ్చి కూల్ డ్రింక్ బాటిల్‌లో పురుగుల మందు కలిపి తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడు సిద్ధారపు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ధర్మవరం పీఈటీ




పీఈటీ మధుబాబును అభినందిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు



బహుమతిని అందుకుంటున్న మధుబాబు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయమ ఉపాధ్యాయుడు యు.మధుబాబు ఎంపిక అ య్యారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి 43వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలలో ధర్మవరం జడ్పీహెచ్ఎస్ పీఈటీ పాల్గొని 4-100 మీటర్స్ రిలేలో గోల్డ్ మెడల్, 4-400 మీటర్స్ రిలేలో సిల్వర్ మెడల్, 1500మీటర్ల పరుగు పందెంలో కాంస్య మెడల్ సాధించాడు. మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బెంగుళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు మధుబాబు ఎంపిక అయ్యాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన మధుబాబును జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అ సోసియేషన్ సెక్రటరీ పి. శివశంకర్, ధర్మవరం జడ్పీహెచ్ఎస్ హెచ్‌యం యు. శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శాలువతో సత్కరించి అభినందించారు.



బుర్రా నుంచి కాపాడు జగనన్నా..!

- ఉలవపాడులో వెలసిన ఫ్లెక్సీ
- కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చేష్టలపై విమర్శలు
- వెంటనే స్థానిక నాయకులతో మాట్లాడిన నేతలు
- ఫ్లెక్సీ తొలగింపు, ఈలోపు సోషల్ మీడియాలో వైరల్



ఉలవపాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద వెలసిన ఫ్లెక్సీ

ఉలవపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 'కందుకూరు నియోజకవర్గాన్ని, కార్యకర్తలను వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ నుంచి కాపాడు జగనన్నా..'అంటూ ఉలవపాడులో మంగళవారం రాత్రి వెలసిన ఓ ఫ్లెక్సీ కలకలం రేపుతోంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం పక్కనే ఈ ఫ్లెక్సీని కట్టారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు బుర్రా చేష్టలతో ఉరి వేస్తున్నట్లు చిహ్నంగా కొన్ని చిత్రాలు ఆ ఫ్లెక్సీలో ఉన్నాయి. కనిగిరి నియోజకవర్గంలో బంధుప్రీతి, సామాజిక ప్రేమతో తనని ఎమ్మెల్యేగా గెలిపించిన కార్యకర్తలనే కటకటాలపాలు చేసిన బుర్రా కందుకూరులో అదేతరహాలో ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. బంధుప్రీతితో స్థానికంగా తన వాళ్ల చెప్పిన నేతలకే ఇటీవల పార్టీ పదవులు కట్టబెట్టారని, కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన కార్యకర్తలకు తీరని అన్యాయం చేశాడంటూ భగ్గుమన్నారు. ఇన్‌చార్జిని మార్చకపోతే నియోజకవర్గంలో పార్టీ బతికి బట్టకట్టడం కష్టమని బుర్రా నుంచి పార్టీని, కార్యాకర్తలను కాపాడాలని ఆ ఫ్లెక్సీలో రాసి ఉంది. కాగా, ఫ్లెక్సీ విషయం తెలుసుకున్న వైసీపీ పెద్దలు కందుకూరు నుంచి హుటాహుటిన ఉలవపాడుకు చేరుకుని స్థానిక వైసీపీ నాయకులతో మాట్లాడి అదేరోజు అర్ధరాత్రి తొలగించారు. ఈలోపే సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఈ వ్యతిరేకత ఎటువైపునకు దారి తీస్తుందోనని నియోజకవర్గ వైసీపీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

చిన్నగొడవే.. హంతకులను చేసింది!

6

గాలిపటాలు ఎగరేసి విషయంలో ఆ యువకుల మధ్య చిన్న గొడవ. మాటామాటా పెరిగి 'చంపేస్తా'నంటూ బెదిరింపుల వరకు వెళ్లింది. అనుకున్నట్టే తమను చంపేస్తాడేమోనన్న భయం వారిని నిద్ర పోనీయలేదు. తాము బతకాలంటే వాడ్ని చంపేయాలన్న భావనతో ఆ ఎనిమిది మంది యువకులు పథకం ప్రకారం అనుకున్నది చేశారు. ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని ఉడ్‌హౌస్ సంఘంలో జరిగిన ఓ హత్య కేసులో 8 మంది నిందితు లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులంతా 25 ఏళ్ల వయసు వారే!





బంగారు గరుడ వాహనంపై రంగనాథుడు

వైభవంగా మహామాఘి

జిల్లాలో మహామాఘి (మాఘ పూర్ణిమ), లలితా జయంతి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, గరుడోత్సవాలు జరిగాయి. తల్పగిరి రంగనాథ స్వామి, పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి వైనతేయుడిపై ఊరేగారు. నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. లలిత అమ్మవారు అవతరించిన రోజు కూడా కావడంతో అమ్మవారికి విశేష పూజలు, లలితా సహస్రనామ పారాయణం, హోమాలు జరిగాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

ప్రమాదంలో సోమశిల!

- ఇలాగే వదిలేస్తే తుంగభద్రకు పట్టిన గతే!
- గేట్ల రోప్‌లు దెబ్బతిన్నాయ్!
- తక్షణం పనులు చేసేందుకు ప్రణాళికలు
- సాంకేతిక సలహాదారు కన్నయ్య నాయుడు



సోమశిల డ్యాంపై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కన్నయ్య నాయుడు

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): 'సోమశిల జలాశయంలో క్రస్ట్‌గేట్ల వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయి. డ్యాంకే ప్రమాదం పొంచి ఉంది.' అని రాష్ట్ర జలవనరుల శాఖ సాంకేతిక సలహాదారు కన్నయ్యనాయుడు తెలిపారు. బుధవారం ఆయన డ్యా సందర్శించారు. క్రస్ట్‌గేట్లు, రోప్‌లు, కంట్రోల్‌రూం, స్టాప్‌లాక్‌గేట్ల పనితీరు, నీటి నిల్వ, విడుదల ప్రక్రియను పరిశీలించారు. అలాగే దీర్ఘకాలిక సమస్యలు అడిగి తెలుసుకొని ఆందోళన వ్యక్తం చెందారు. అనంతరం విలేకరులతో కన్నయ్యనాయుడు మాట్లాడుతూ సోమశిలను నిర్లక్ష్యం వహిస్తే తుంగభద్ర గేటు కొట్టుకుపోయినట్టే ఇక్కడే ప్రమాదం జరిగే సూచనలు ఉన్నయని వాపోయారు. సహజంగా ప్రాజెక్టులకు ఏర్పాటు చేసిన గేట్ల రోప్‌లను 10 నుంచి 15 ఏళ్లకు ఒకసారి మార్చాల్సి ఉండగా ఆ దిశగా ఇక్కడ జరుగలేదని అన్నారు. అందువల్ల సోమశిల గేట్లు దెబ్బతిన్నయన్నారు. ప్రాజెక్టు అభివృద్ధి, పర్యవేక్షణ సరిగ్గా లేనందునే ఈ దుస్థితి నెలకొందని దుయ్యబట్టారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు మార్గనిర్దేశం చేసి ప్రత్యేక ఆర్మీ అండర్ వాటర్ టీంను పిలిపించి నీటిలోపల దెబ్బతిన్న రోప్‌లు, గేట్ల పటిష్ట పనులు త్వరలో చేసేలా ప్రణాళిక చేశామని చెప్పారు. తాను గుర్తించిన సమస్యలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపి సోమశిల పటిష్టతకు చర్యలు చేపడతానని వివరించారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ దశరధరామిరెడ్డి, జేఈలు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్‌యార్డులో సభావేదిక ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఆనంద్, పక్కన ఎమ్మెల్యే ఇంటూరి, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు

15న సీఎం వస్తున్నారు..

జాగ్రత్త!

- ఏర్పాట్లలో ఏలోటూ రానీయద్దు!
- అందరూ సమష్టిగా పని చేయండి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం
- ఎస్పీ, ఎమ్మెల్యేతో కలిసి ఏర్పాట్ల పరిశీలన

కందుకూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : 'స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కందుకురు వస్తున్నారు. ఏర్పాట్లు, భద్రతలో ఏలోటూ రానీయద్దు.' అంటూ కలెక్టర్ ఓ ఆనంద్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి కందుకూరులో సీఎం పర్యటన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెలిప్యాడ్, బహిరంగ సభ జరిగే వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంతోపాటు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలలో చంద్రబాబు పాల్గొనేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను వారు పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో చేపట్టాల్సిన కట్టుదిట్టమైన ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఏర్పాట్లపై ఆయా శాఖలు తీసుకోవాల్సిన బాధ్యతలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెలిప్యాడ్‌కు జరుగుతున్న ఏర్పాట్లను, అనంతరం టిడ్కో గృహ సముదాయాన్ని, వాసవీనగర్‌ను పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాలలో ఒకచోట సీఎం చంద్రబాబు స్వచ్ఛాంధ్ర లక్ష్యం ప్రజలకు అర్థమయ్యేలా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టనున్నారు. అనంతరం దూబగుంట సమీపంలో వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి భద్రతా పరంగా తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. చివరగా బహిరంగ సభాస్థలిగా నిర్ణయించిన మార్కెట్ యార్డు ప్రాంతాన్ని వారు పరిశీలించారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై వారు సూచనలు చేశారు. సభావేదికకు వచ్చే వారంతా ఇబ్బంది పడకుండా కూర్చునేలా ఏర్పాట్లు చేయటంతోపాటు పార్కింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలపై వారు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. వారివెంట కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ, పట్టణ పరిపాలన శాఖ కమీషనర్ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కె. అనూష, తహసీల్దారు ఇక్బాల్, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర కాలువ బాగుపడేనా...?

- 'రాళ్లపాడు'తోపాటు చెరువులకు నీరు చేరేనా...
- మట్టి, ముళ్లకంపతో పూడిన కెనాల్
- అభివృద్ధిని మరచిన పాలకులు, అధికారులు

- వివరాలు 6లో

కార్పొరేటర్లకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కరిముల్లాకు కాకుండా స్వతంత్ర అభ్యర్థికి ఓటు వేసిన 42 మంది వైసీపీ కార్పొరేటర్లకు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి కార్తీక్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పార్టీ విప్ ఉల్లంఘనకు పాల్పడ్డ కార్పొరేటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ విప్ ఊటుకూరు నాగార్జున, నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ప్రిసైడింగ్ అధికారి కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా దీనిపై వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



దివ్యాంగులకు ఇంధన రాయితీ!

- వాహనాలకు రూ.2వేల వరకు సబ్సిడీ
- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు తీపి కబురు అందించింది. వైకల్యం కలిగి స్వయం ఉపాధి పొందుతున్న వారికి, ప్రైవేటు ఉద్యోగులకు రాయితీపై పెట్రోలు, డీజిల్ అందించనుంది. ఇందుకు సంబంధించి జిల్లాలో వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మూడు చక్రాల మోటారు వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఇంధన భారం లేకుండా 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాయితీపై పెట్రోలు, డీజిల్ అందించే పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ఈ పథకాన్ని నామమాత్రంగా అమలు చేసింది. దీనికోసం కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయలేదు. గతేడాది ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరిగి దివ్యాంగులకు రాయితీపై ఇంధనం ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది.

అర్హులు ఎవరంటే..

ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి నిమిత్తం మూడు చక్రాల మోటారు కలిగిన వాహనాలు వినియోగించే దివ్యాంగులకు ఈ పథకాన్ని వర్తింప జేస్తారు. వాహనానికి వినియోగించే డీజిల్, పెట్రోలు ఖర్చులో 50 శాతం రాయితీ ఇస్తారు. లబ్ధిదారులు ఇంటి నుంచి పని ప్రదేశానికి వెళ్లే దూరానికి మాత్రమే ఈ రాయితీ వర్తింపజేస్తారు. 2 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన వాహనాలకు నెలకు గరిష్ఠంగా 15లీటర్లు అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న వాహనాలకు గరిష్ఠంగా 30 లీటర్ల వరకు లేదా నెలకు రూ.2వేల వరకు లబ్ధి చేకూరుతుంది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న దివ్యాంగులకు మాత్రమే ఈ రాయితీ ఉంటుంది. ఇంధనం రాయితీకి సంబంధించి, ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులు వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఆ తర్వాత రాయితీ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారు.

అవసరమైన ధ్రువపత్రాలు

దరఖాస్తుతోపాటు సదరం సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం మొదటిపేజీ, ఆధార్‌కార్డు, వ్యాపారం లేదా ఏదైనా సంస్థలో పనిచేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలి.



ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు!



రాయితీ ఇంధనం కోసం అర్హత ఉన్న దివ్యాంగులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం ఇంధనం కొనుగోలు చేసిన బిల్లులు కార్యాలయంలో సమర్పించాలి. ఆ తర్వాత రాయితీ మొత్తాన్ని లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో చేమ చేస్తాము.

- అత్తర్ మొహమ్మద్ అయూబ్, ఏడీ, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ

'చెత్త'శుద్ధి లేదా!?

- కార్యాలయాల ముందే వ్యర్థాలు
- అధికారుల్లారా కళ్లు తెరవరేం!

ఎటు చూసినా చెత్తా చెదారం.. నరికేసిన చెట్ల మొదళ్లు.. భవనాల శిథిలాలు.. మురుగు కంపు.. ఇవండీ మన ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి. వివిధ పనుల కోసం నిత్యం కార్యాలయాలకు వస్తున్న ప్రజలు వీటిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. సాక్షాత్తు జిల్లా ఉన్నతాధికారులు ఉండే ప్రాంతాల్లోనే పరిసరాలు ఇలా ఉంటే ఇక పల్లెసీమల మాటేమిటంటూ నిట్టూరుస్తున్నారు. నెల్లూరు నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లోపేరుకుపోయిన చెత్తాచెదారాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది. ఈ ఫొటోలను చూసైనా చెత్తను, వ్యర్థాలను తొలగిస్తారేమో వేచి చూడాలి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో..



పాత సామగ్రి మధ్యలో మసకబారిన బాపూజీ, ఎన్టీఆర్ విగ్రహాలు



అంబేడ్కర్ సంక్షేమ కార్యాలయ ప్రాంగణంలో చెత్తతో నిండిపోయిన మురుగు కాలువ



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో..



పాత జడ్పీ కార్యాలయంలో ఈ చెట్ల మొదళ్లు ఇంతేనా!?



పాత కార్పొరేషన్ కార్యాలయంలో..



నీటి కొలను ఇలా మారిపోయింది!

సత్యనారాయణ వ్రతాలు.. భక్తిశ్రద్ధలతో మాఘ పౌర్ణమి

గరుడోత్సవాలు !

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : మాఘ పూర్ణిమ, లలితా జయంతి సందర్భంగా బుధవారం నగరంలోని ఆలయాల్లో అభిషేకాలు, పూజలు, వ్రతాలు, హోమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.

- తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి విశేష ద్రవ్యాలతో తిరుమంజనం, రాత్రి బంగారు గరుడసేవ జరిగాయి.
- రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకాలు, నవావరణ పూజ జరిగాయి. అనంతరం రమాదేవి సమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. ప్రధాన అర్చకుడు రఘురామశర్మ భక్తులతో వ్రతం జరిపించారు. సాయంత్రం అమ్మవారికి విశేష పూలంగిసేవ, కుంభహారతులు, పల్లకీ, ఊంజల్ సేవ జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. మహాత్మా గాంధీ నగర్ శ్రీకృష్ణమందిరంలో సామూహిక సత్య నారాయణ వ్రతం జరిగింది.
- మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం శ్రీనివాస కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. సాయంత్రం పూలంగి సేవ, విశేష పూజలు, రాత్రి స్వామివారికి గరుడసేవ జరిగాయి. ఆలయ ఈవో విజయకృష్ణ, శ్రీనివాస్ పర్యవేక్షించారు.
- స్వర్ణాల చెరువు తీరాన ఉన్న స్వర్ణ లింగేశ్వర ఆలయంలో చండీ హోమం జరిగింది. ● నగరం లోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో కొలువైయున్న శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామికి మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి గరుడోత్సవం వైభవంగా జరిగింది. వికాస్ ప్రజాహిత సేవా సమితి వ్యవస్థాపకుడు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరిగింది. కల్యాణ వేంకటేశ్వరస్వామికి తొలిసారి గరుడ వాహనంపై నగరోత్సవం నిర్వహించడంపై భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు. ఇంటింటా కర్పూర నీరాజనాలు అర్పించారు. ఇస్కాన్ భక్తుల సంకీర్తనలు, కోలాటాలు, పండరి భజనలు, దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.


రాజరాజేశ్వరి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరిస్తున్న భక్తులు


మాగుంటలే అవుట్‌లో గరుడ వాహనంపై వేంకటేశ్వరస్వామి


బాలాజీనగర్‌లో గరుడ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడి నగరోత్సవం

ప్రతి 3వ శనివారం

'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర'

● దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ జనార్దన్‌రెడ్డి

దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



?: 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో ఏం చేస్తారు.

!: ఆలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమా నికి ప్రభుత్వం నన్ను నోడల్ అధికారిగా నియమించింది.

?: దేవదాయ భూముల సమస్య పరిష్కారం మాటేమిటి.

!: రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ శాఖ భూముల సమస్యపై రెవెన్యూ శాఖకు 763 అర్జీలు వచ్చాయి. సుమారు 8వేల ఎకరాల దేవదాయ శాఖ భూముల వివరాలు వెబ్‌ల్యాండ్‌లో (ఆన్‌లైన్) నమోదు చేయాల్సి ఉంది.

?: జిల్లాలో ఆలయాల జీర్ణోద్ధరణ ఎప్పుడు

!: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలో 18 పురాతన దేవాలయాల పునర్నిర్మాణానికి టెండరు ప్రక్రియ జరుగుతోంది.

?: పునర్నిర్మాణానికి ఎంత ఖర్చు చేస్తారు.

!: నెల్లూరు మూలాపేటలోని వేణు గోపాలస్వామి, సోమశిల సోమేశ్వరా లయంతోపాటు కావలి, ఆత్మకూరు, కోవూరు నియోజకవర్గాల్లోని పురాతన ఆలయాలు పునర్నిర్మాణానికి రూ.60కోట్లు మంజూరయ్యాయి.

?: శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ఎలా ఉన్నాయి.

!: జిల్లాలో ప్రముఖ ఆలయాల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. నెల్లూరులోని మూలస్థానేశ్వరాలయానికి నన్ను ఫెస్టివల్ అధికారిగా ప్రభు త్వం నియమించింది. గండవరం ఉదయకాళేశ్వరాలయం, కృష్ణాపట్నం సిద్ధేశ్వరాలయం, కాటేపల్లి శివాలయంలతోపాటు అన్ని శైవ క్షేత్రాల్లో ఏర్పాట్లు చేస్తున్నాము.



మీ కోసం MEE KOSAM

వంటింట్లో సిలిండరు...

ఆదమరిస్తే డేంజరు!

● అప్రమత్తతతో నివారణ సాధ్యం

● జాగ్రత్తలు పాటిస్తే మంచిది

వంటగ్యాస్ నిత్యావసర వస్తువు. ప్రస్తుతం ప్రతి ఇంట్లో దీని వినియోగం తప్పనిసరి. గ్యాస్ సిలిండరులో ఉండే ద్రవ రూప ఇంధనం (బ్యూటేన్ పెట్రోలియం)తో అప్రమత్తంగా ఉంటేనే సురక్షితం. ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా మూల్యం చెల్లించక తప్పదు. గ్యాస్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి, నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసుకుందాం...

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

జాగ్రత్తలు ఇవిగో...

- సిలిండరు కన్నా స్టౌ ఎప్పుడూ ఎత్తులోనే ఉంచాలి.
- సిలిండరును క్రమం తప్పకుండా పరిశీలించాలి.
- రెగ్యులేటర్‌ను మరో ట్యూబ్‌తో జత చేయకూడదు.
- వంట పూర్తయ్యాక రెగ్యులేటర్ కట్టేయాలి.
- రెండు రోజులకంటే ఎక్కువ రోజులు సిలిండరును వినియోగించే అవసరం లేకుంటే రెగ్యులేటర్‌ను తొలగించి సేఫ్టీ క్యాప్ పెట్టాలి.
- ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలోనూ సిలిండరు నుంచి రెగ్యులేటర్‌ను వేరు చేసి క్యాప్ పెట్టాలి.
- రెగ్యులేటరు బిగించిన తర్వాత గ్యాస్ సక్రమంగా వస్తుందో, లీకవుతుందో ఒకటికి రెండుసార్లు పరిశీలించాలి.
- మార్కెట్‌లోకి నకిలీ పరికరాలు విచ్చలవిడిగా వస్తున్నాయి. గ్యాస్ కంపెనీలు అందించే పరికరాలనే వినియోగించాలి. అదనంగా పొయ్యి కోసమని, ఎక్కువ మంట కోసమని అధిక మొత్తంగా గ్యాస్ విడుదల చేస్తుందంటూ, గ్యాస్ ఆదా అవుతుందంటూ... మార్కెట్‌లో పరికరాలు విచ్చలవిడిగా వస్తున్నాయి. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

● గ్యాస్ లీకవుతుంటే...

గ్యాస్ సిలిండరులో ముఖ్యంగా వాల్వుకు ఏర్పాటు చేసి ఉన్న వాషర్‌తోనే ప్రమాదాలు సంభవిస్తాయి. ఒక్కొక్కసారి వాషర్‌ను చమురు కంపెనీలు సకాలంలో మార్చకపోవడంతో అవి దృఢస్థాయికి చేరుకుంటాయి. దీంతో రెగ్యులేటరును అంటిపెట్టుకుని ఉండేతత్వాన్ని కోల్పోతాయి. ఇటువంటి సమయంలో రెగ్యులేటరును సిలిండరుకు పెట్టి ఆన్ చేయగానే గ్యాస్ లీకవుతుంది. లీకేజిని గమనించిన వెంటనే గ్యాస్ డీలరుకు సమాచారం అందించాలి. డీలరు పంపిన వ్యక్తి వచ్చి సిలిండరును మార్చడమో, వాషర్‌ను సరి చేయడమో చేస్తారు. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నెంబర్లను సంప్రదించి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండడం అవసరమని నిపుణులు తెలియ చేస్తున్నారు.

● కాల పరిమితి ఇలా..

గ్యాస్ సిలిండరు కాలపరిమితిని సూచించే నెంబరు సిలిండరుపై ఉంటుంది. సిలిండరుకు పైభాగంలో ఉండే రింగ్ కమ్ములకు వెనుకవైపున ఏ21, బీ21, సీ21, డీ21 అనే నెంబర్లలో ఏదొకటి ఉంటుంది. ఏ అంటే జనవరి, ఫిబ్రవరి, మార్చి 2025 అని అర్థం. బీ అంటే ఏప్రిల్, మే, జూన్, సీ అంటే జూలై, ఆగస్టు, సెప్టెంబరు, డీ అంటే అక్టోబరు , నవంబరు, డిసెంబరు అని అర్థం. ఈ నెంబర్ల ఆధారంగా సిలిండర్ గడువు తేదీ ఎప్పటివరకు ఉందో తెలుసుకోవచ్చు.

● ఏడు నెలలకొకసారి ట్యూబ్ మార్చాలి

ప్రస్తుతం ఆకుపచ్చ రంగు ట్యూబ్‌ను చమురు కంపెనీలు నిషేధించాయి. వీటి స్థానంలో ఎరుపురంగు ట్యూబ్‌ను అందిస్తున్నాయి. ఏడు నెలలకొకసారి సురక్ష ట్యూబ్ మార్చుకోవాలని గ్యాస్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సురక్ష ట్యూబ్‌ను చమురు కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. తక్కువ ధరకు లభిస్తున్నాయంటూ మార్కెట్‌లో లభించే నకిలీ ట్యూబ్‌ను వినియోగిస్తే వాటిలో పగుళ్లు ఏర్పడి గ్యాస్ లీకవడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని గమనించాలి.

గమనించాల్సిన అంశాలు

● సిలిండరు నుంచి గ్యాస్ లీకవుతున్నట్లు, గ్యాస్ వాసన వస్తున్నట్లు గమనిస్తే వెంటనే ఎలక్ట్రిక్ స్విచ్‌లు వేయడం ప్రమాదకరం. ఈ సమయంలో నెమ్మదిగా వెళ్లి సిలిండరుపై ఉన్న రెగ్యులేటర్‌ను తొలగించి సిలిండరును ఇంట్లో నుంచి బయటకు తీసుకురావాలి. ● వంటింట్లో కిరోసిన్ నిల్వ చేయడం సర్వసాధారణం. ఇది ప్రమాదానికి కారణం అవుతుంది. కిరోసిన్ నుంచి విడుదలయ్యే వాయువులు ఒక్కొక్కసారి చాలా తీవ్రతరంగా మారి విస్ఫోటనాన్ని సృష్టించిన ఘటనలు ఉన్నాయి. ● నాణ్యమైన స్టౌ వాడాలి. ఇందుకు పేరున్న కంపెనీల స్టౌలే ఉత్తమం. వీటి వాడకం వలన గ్యాస్ ప్రమాదాల నివారణతో పాటు గ్యాస్ వృథాను అరికట్టవచ్చు. ● ఎలక్ట్రానిక్ వస్తువులు వంటివి వంటగదిలో ఉండకూడదు. ● గ్యాస్ లీకవుతున్నట్లు గమనిస్తే వెంటనే తమ పరిధిలోని డీలరు ల్యాండ్ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలి. వెంటనే గ్యాస్ సర్వీసు బాయ్‌ను పంపాల్సిన బాధ్యత వారిపై ఉంది.

● 'రాళ్లపాడు'తోపాటు చెరువులకు నీరు చేరేనా!?

● మట్టి, ముళ్లకంపతో పూడిన కెనాల్

● అభివృద్ధిని మరచిన పాలకులు, అధికారులు

ఉత్తర కాలువ

బాగుపడేనా...?

కొండాపురం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): సోమశిల ఉత్తర కాలువ ద్వారా మండలంలోని పలు గ్రామాల చెరువులకు నీరు అందించేందుకు అధికారులు సుమారు 40 ఏళ్లక్రితం నిర్ణయం తీసుకున్నారు. దీంతో అప్పటి ప్రభుత్వం కాలువ తవ్వేందుకు నిధులు కేటాయించింది. కాలువ నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చూపాయి. దీంతో కొన్నిరోజులు పనులు ఆగిపోయాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం కాలువ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయగా, 2017లో మండలానికి సోమశిల నీరు చేరింది. అప్పట్లో కాలువ తవ్వకంలో నాణ్యతా లోపంతో నీరు సక్రమంగా చెరువులకు చేరలేదని మండల రైతులు ఆరోపిస్తున్నారు.


కంపచెట్లతో కుంచించుకుపోయిన కాలువ

పరిహారమేదీ ?

సోమశిల నుంచి నీరు సుమారు 110 కిలోమీటర్ల దూరం ప్రవహించి రాళ్లపాడు రిజర్వాయరుకు చేరాలి. భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందించడం లోనూ ఇటు అధికారులు, అటు పాలకులు నిర్లక్ష్యం చూపారని రైతులు అంటున్నారు. తమకు పరిహారం అందలేదని చింతలదీవి గ్రామరైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ గ్రామం వద్ద సుమారు 600 మీటర్ల దూరం కాలువ తవ్వకం ఆగిపోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చొరవ తీసుకొని రైతులతో మాట్లాడటంతో కాలువ తవ్వకానికి మార్గం సుగమమైంది. 2017-18లో కాలువ ద్వారా నీరు రాళ్లపాడుతోపాటు సత్యవోలు, కొమ్మి, సాయిపేట, రేణమాల చెరువులకు చేరగా, రైతులు పంటలు పండించుకున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కాలువను తవ్వి వదలేయడంతో వర్షాలకు, నీటి ప్రవాహానికి పూడిపోయింది. కంపచెట్లు కూడా పెరిగాయి. పూడికతీయడంతోపాటు కాలువను అభివృద్ధి చేసి మండలానికి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు. అలాగే భూమి కోల్పోయిన రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని వారు కోరుతున్నారు.


జలాశయం ఎగువన అలివి వల లాగుతున్న జాలర్లు (ఫైల్)

నిషేధిత అలివి వలలతో వేట

● సోమశిలలో తగ్గుతున్న మత్స్యసంపద

● ఇబ్బందులు పడుతున్న జాలర్లు

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో నిషేధిత అలివి వలలతో అక్రమంగా వేట సాగిస్తుండడంతో మత్స్యసంపద కరువై జాలర్లు ఇబ్బందులు పడుతున్నారు. సోమశిల ప్రాజెక్టులో అలివి వలలతో వేట సాగించడం నిషేధం. కానీ కొందరు ముఠా నాయకులు, వ్యాపారులు అలివి వలలతో జాలర్లతో వేట సాగించి సంపదను కొల్లగొడుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానిక జాలర్లు విమర్శిస్తున్నారు. ప్రాజెక్టు ఎగువన ఉన్న ప్రాంత మంతా కడప జిల్లా సరిహద్దు కావడంతో ఎగువకు వెళ్లి తనిఖీలు చేయక పోవడంతో విచ్చలవిడిగా అలివి వలలతో వేట సాగిస్తున్నట్లు సమాచారం. కాగా, అలివి వలలతో వేట సాగించడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద కరువై జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఇకనైనా సోమశిల జలాశయంలో అలివి వలలతో వేట సాగించకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మత్స్యకారులు జిల్లా అధికారులను కోరుతున్నారు.


మాట్లాడుతున్న ఏడీ సుమతి, పక్కన శాస్త్రవేత్తలు

రేపు కిసాన్ మేళా

● వేదిక నెల్లూరు ఏఆర్ఎస్ ● ఆధునిక సాంకేతికతపై సదస్సు, ప్రదర్శనలు

● తిరుపతి ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంయుక్తంగా నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం(ఏఆర్ఎస్)లో శుక్రవారం కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్) సహ సంచాలకులు డాక్టర్ వీ సుమతి పేర్కొన్నారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత - లాభ సాటి వ్యవసాయం అనే ప్రధానాంశంతో రైతు లకు వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడమే లక్ష్యంగా ఈ మేళా జరుగుతుందని, 60 స్టాళ్లతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వరి, అపరాలు, వాణిజ్య, ఉద్యాన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్తలు వివరిస్తారని తెలిపారు. ఆక్వా కల్చర్‌లో నూతన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తారన్నారు. శాస్త్రవేత్తలు, రైతులతో చర్చా కార్యక్రమం కూడా ఉంటుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ యూ వినీత, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లలితా శివజ్యోతి పాల్గొన్నారు.

పథకం ప్రకారమే హత్య

● కదలికలపై నిఘా

● ఉడ్‌హౌస్‌సంఘం మర్డర్ కేసులో 8 మంది అరెస్టు

● నిందితులందరూ 25 ఏళ్లలోపు వారే!

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వారందరూ పాతికేళ్లలోపు యువకులే. పెద్దగా నేర ప్రవృత్తి లేదు. ఏటి పండుగలో ఒకరితో మొదలైన చిన్న గొడవ ఒక ప్రాణం తీసే వరకు వెళ్లింది. నెల్లూరులోని ఉడ్‌హౌస్ సంఘంలో ఈ నెల 8వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసును నవాబుపేట పోలీ సులు ఛేదించారు. నిందితుల వివరాలను నగర డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ సింధుప్రియ బుధవారం మీడియాకు వెల్లడించారు.

ఉడ్‌హౌస్ సంఘానికి చెందిన కోడూరు కల్యాణ్ ఉరాఫ్ చిన్నా(25) పెయింట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనిపై నవా బు పేట పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీటు ఉంది. 8వ తేదీ రాత్రి ఉడ్‌హౌస్ సంఘం వెనుక సిమెం ట్ రోడ్డులో స్నేహితులతో కలిసి మద్యం సేవి స్తుండగా రెండు ద్విచక్ర వాహనాల్లో గుర్తు తెలియని ఐదుగురు వచ్చి చిన్నాపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలతో రక్తపు మడుగులో ఉన్న చిన్నాను స్నేహి తులు జీజీహెచ్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. చిన్నా తల్లి వేళాంగణి ఫిర్యాదుతో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా హత్య కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ సింధుప్రియ నేతృత్వంలో తన సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేట్టారు. నేరస్థలిలో లభ్యమైన ఆధారాలు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులు జాకీర్ హుస్సేన్ నగర్‌కు చెందిన దోనిపర్తి అజయ్‌కుమార్, మన్సూర్‌నగర్‌కు చెందిన మురు గన్ అజిత్ అలియాస్ కుల్లా, భగత్‌సింగ్ కాలనీకి చెందిన శివకుమార్, కుసుమ హరిజన వాడకు చెందిన ఏ ఉదయ్ కిరణ్, సత్యనారాయణపురానికి చెందిన వీ సురేంద్ర అలియాస్ సూరి అలియాస్ రాక్, స్టోన్‌హౌస్‌పేటకు చెందిన కే పవన్‌కుమార్, శెట్టిగుంట రోడ్డుకు చెందిన కే రమేష్, కిసాన్ నగర్‌కు చెందిన జీ మనోజ్ కుమార్‌గా గుర్తించారు. వారిని బుధవారం అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

ఏటి పండుగలో గొడవ

గత నెల 16న పెన్నానది ఒడ్డున జరిగిన ఏటి పండగలో గాలిపటాలు ఎగురవేస్తుండగా చిన్నా, అజయ్ మధ్య గొడవ జరిగింది. అది ముదిరి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో అజయ్‌ను చంపుతానని చిన్నా తరచూ బెదిరించేవాడు. చంపేస్తాడన్న భయంతో అజయ్ తన స్నేహితులు అజిత్, శివకుమార్, ఉదయ్‌కిరణ్, సురేంద్ర, పవన్‌కుమార్, రమేష్, మనోజ్ కుమార్‌తో కలిసి చిన్నాను హత్య చేయాలని నిర్ణయించారు. పవన్ కుమార్, రమేష్, మనోజ్‌కుమార్‌లు చిన్నా కదలికలపై నిఘా ఉంచారు. ఈ నెల 8వ తేదీ రాత్రి చిన్నా తన స్నేహితులతో ఉడ్‌హౌస్ సంఘంలో మద్యం సేవిస్తున్న విషయాన్ని తెలుసుకున్నారు. దీంతో అజయ్ తన స్నేహితులు అజిత్, శివకుమార్, ఉదయ్‌కిరణ్, సురేంద్రతో అక్కడికి చేరుకుని చిన్నాపై కత్తులతో దాడి చేసి పరారయ్యారు. ఈ నేరాన్ని నిందితులు అంగీకరించిన ట్లు పోలీసులు తెలిపారు. హత్యకు ఉపయోగించిన కత్తులు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై త్వరలోనే రౌడీషీట్లు తెరుస్తామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా, ఎస్‌ఐలు రహిమాన్, శీనయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.


నిందితుల వివరాలు తెలుపుతున్న నగర డీఎస్పీ సింధుప్రియ

పూనూరు రవికుమార్‌రెడ్డికి ఘన నివాళులు


పూనూరు రవికుమార్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి) జిల్లా టీడీపీ మాజీ కార్యదర్శి పూనూరు రవికుమార్‌రెడ్డి పెద్దకర్మను పురస్కరించుకుని బుధవారం కావలి పాతూరులోని ఆయన నివాసం వద్ద ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తదితరులు ఘననివాళులర్పించారు. రవికుమార్ చిత్రపటం వద్ద పూలతో శ్రద్ధాంజలి ఘటించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రవికుమార్ మృతి బాధాకరమని, టీడీపీ తీరని లోటని ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు మన్విత రెడ్డి, పాయిప్రసాద్‌రెడ్డి, పూనూరు సౌమ్య, టీడీపీ సీనియర్ నాయకులు డాక్టర్ పూనూరు వెంకారెడ్డి, పూనూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పూనూరు మాధవిరెడ్డి, మురళీరెడ్డిలను ఎమ్మెల్యే పరామర్శించి సానుభూతి తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నగళ్ల శ్రీనివాస్ కిరణ్, తలమంచిరవి, తిరివీధి ప్రసాద్, చవల రామకృష్ణ తదితరులు పాల్గొని రవికుమార్‌కు నివాళులర్పించారు.

● అనాథ బాలలకు దేవుడు శరత్‌బాపూజీ

అల్లూరు : అనాథ బాలలకు చైల్డ్ ఆశ్రమ చైర్మన్ రామచంద్ర శరత్‌బాపూజీ దేవుడని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలో బోగోలుకి చెందిన అమరా బచ్చు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు బాలల కోసం నిర్మించిన పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆశ్రమంలోని అన్ని వసతులను, భవనాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వందలాదిమంది బాలలను అక్కున చేర్చుకున్న రామచంద్ర శరత్‌బాబు లాంటివారు ఉండడం దేశం గర్వించదగిన విషయమన్నారు. తదుపరి అమరా బచ్చు ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్-సంధ్య దంపతులు, ట్రస్టీ ఎస్. ఆనంద్ సాగర్ మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, దాసరి కరుణాకర్, పెయ్యల భాస్కర్, గుంజి మల్లికార్జున పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన ఎమ్మెల్యే కాకర్ల

● అధికారులు లేకపోవడంతో అసహనం


అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కొండాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో తహసీల్దార్, డీటీ, ఆర్ఐ లేకపోగా, సీనియర్ అసిస్టెంటు, కొందరు వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. అధికారులు అందుబాటులో లేకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని సిబ్బందిని ప్రశ్నించారు. వీఆర్‌వోల కొరత, కార్యాలయానికి ప్రహరీ గోడ, టాయిలెట్ల సమస్య ఉందని వాటిని పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల అర్జీలను పరిశీలించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు, మాజీ కన్వీనర్ బొట్లగుంట హరిబాబు, నాయకులు జాగర్లమూడి శ్రీను, దాసరి అశోక్, టీ.అనూష, నర్రా శివన్నారాయణ, కొమ్మి ప్రభాకర్ ఉన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉదయగిరి : స్థానిక ఎంఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రూ.5 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేయనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

చర్చి నిర్మాణానికి విరాళం


ఎమ్మెల్యే ఇంటూరి చేతుల మీదుగా విరాళం అందజేస్తున్న మాల్యాద్రి

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులో చర్చి నిర్మాణం కోసం టీడీపీ నాయకుడు రెబ్బవరపు మాల్యాద్రి రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈమొత్తాన్ని ఆయన నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, రావుల రవి పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో బహుళ ప్రయోజనాలు


ఉదయగిరి: రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

ఉదయగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుతో రైతులకు అన్ని సంక్షేమ పథకాలు చేరువవుతాయని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఆధార్, పొలం పాసు పుస్తకం, ఆధార్‌తో లింకైన ఫోన్ తీసుకొని తమ పరిధిలోని రైతుసేవా కేంద్రానికి గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్దకు వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీ విత్తనాలు, బీమా, పంట నష్ట పరిహారం, పంట రుణాలు తదితరాలు రానున్న రోజుల్లో ఈ విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే దక్కుతాయన్నారు. రైతులకు అన్ని ఎరువులతోపాటు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు శేషగిరి, నర్సోజీరావు, వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్, ఏఈవో వినోద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : రైతులందరూ ఈనెల 25వ తేదీలోగా రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు దేవసేనమ్మ తెలిపారు. బుధవారం ఆమె మండల వ్యవసాయ అధికారిణి రజనితో కలసి కొండమీదకొండూరు, కుప్పూరుపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రాయితీ పథకాలు రైతులకు అందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఈవో చిరంజీవి, విఏఎలు పాల్గొన్నారు.

ఆటోల్లో ఓవర్‌లోడ్ వద్దు : ఆర్టీవో


ఉలవపాడు : మాట్లాడుతున్న రాంబాబు

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీవో టీఎస్ లక్ష్మి హెచ్చరించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు పాటించకుంటే, కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ సీహెచ్ రాంబాబు పాల్గొన్నారు.

● ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి): వాహక చోదకులు రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని కందుకూరు ఎంఈఐ చెన్నూరి రాంబాబు తెలిపారు. బుధవారం ఉలవపాడులోని ట్రక్ ఆటో యూనియన్ కార్యాలయం వద్ద 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా వెంట ఉండాలని తెలిపారు. అనంతరం అధికారులను ఆటో కార్మికులు శాలువాలతో సత్కరించారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవారిపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు యనమల నాగరాజు తెలిపారు. బుధవారం ఆయన గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. వీఆర్వోలు, సర్వేయర్ గ్రామంలోని భూముల వద్దకే వచ్చి సమస్యల పరిష్కారానికి రీసర్వే చేస్తున్నారని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గండిపాళెంలో భయం.. భయం

కోతులు, కుక్కల బెడదతో బెంబేలెత్తుతున్న జనం


వీధుల్లో సంచరిస్తున్న శునకాలు


నివాసాల్లో కోతుల వీరంగం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో కోతులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బస్టాండ్ సెంటరు, ప్రధాన వీధులు, పాఠశాలలు, వైద్యశాలల సమీపంలో గుంపులు, గుంపులుగా సంచరిస్తుండడంతో అటు వైపు ప్రయాణాలు సాగించే ప్రజలు, వాహనదారులు వాటి నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలను వెంటాడుతుండడంతో నివాసాల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. కుక్కల బారి నుంచి తప్పించుకున్నామని ఊపిరి పీల్చుకొంటున్న తరుణంతో ఏకంగా కోతులు నివాసాల్లోకి దూసుకెళ్లి వీరంగం సృష్టిస్తున్నాయి. దీంతో అటు నివాసాల్లో ఉండలేక, ఇటు బయటకు వెళ్లలేక నానా యాతన అనుభవించాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. వాహనదారులను సైతం రహదారుల వెంట వెంబడిస్తుండడంతో తప్పించుకునే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈనేపథ్యంలో కొంతమంది చేతిలో కర్రలు పట్టుకొని ప్రయాణాలు సాగిస్తుండగా, మరికొంతమంది వాటి బారి నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్లి పాఠశాల వద్ద వదిలి వస్తున్నారు. పగలు ఎలాగోలా కాలం గడిపినప్పటికీ రాత్రి సమయంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఇటీవల కుక్కల దాడికి గురైన ఓ వ్యక్తి వైద్యం కోసం పరుగులు తీసిన సమయంలో తీరా వైద్యశాల వద్ద కూడా మరోమారు కుక్కలు దాడికి పాల్పడడం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోతులు, కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం


సంగం: సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్నఅర్చకులు

సంగం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న శ్రీ కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రమాదేవి సమేత సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు క్షీర, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

రాజరాజేశ్వరి ఆలయంలో...

తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పూలంగిసేవ ఏర్పాటు చేశారు. కుంకుమార్చన, లలిత సహస్రనామం, హోమం నిర్వహించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

●సీతారామపురం: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

కావలి : పట్టణంలోని పెద్ద చెరువువద్ద ఉన్న కూచి చినమాలకొండయ్య క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్ల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలు మధ్య సాగిన కల్యాణోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా స్వామి, అమ్మవార్లను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శాశ్వత మంచినీటి పథకాన్ని ఆయన ప్రారంభించారు.

ఆర్సీపాలెంలో మహా చండీయాగం

రూరల్ మండలం రాజువారి చింతలపాలెం(ఆర్సీపాలెం)లోని శ్రీవిజయదుర్గ ఆస్థానపీఠంలో పీఠాధిపతి వీర బ్రహ్మయ్యస్వామి ఆధ్వర్యంలో బుధవారం శ్రీ మహాగణపతి లక్ష్మీమహా చండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఛండీ యాగంలో పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడికి ఏకాంతసేవ

కావలిటౌన్: పట్టణంలోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారికి ఏకాంతసేవ నిర్వహించారు. ప్రధాన అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు పర్యవేక్షణలో ముందుగా స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం తోమాలసేవ, హోమం పూజలు చక్రస్నానం జరిగాయి. సాయంత్రం ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. గురువారం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

బిట్రగుంట : బోగోలు మండలం చెన్నారెడ్డిపాలెం కొత్తూరులో ఉన్న పోలేరమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూడురోజులపాటు సద్ది, పొంగళ్లు, మొక్కులతో జాతర ముగిసింది. అమ్మవారిని శాంతింప చేయడానికి వేద పండితులు పసుపు, డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్తలు కైపు సుబ్బారెడ్డి, యారం శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు.

వెంగమాంబ సన్నిధిలో వేలంపాటలు

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో బుధవారం దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో వివిధ హక్కులు పొందేందుకు బహిరంగ వేలం, టెండర్లు నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునే హక్కును బాపట్ల జిల్లా అద్దంకికి చెందిన సుబ్బరాయుడు రూ.16.10 లక్షలకు, ఎండుకొబ్బరి అమ్ముకునే హక్కును నర్రవాడకు చెందిన నక్క నాగ భూషణం రూ. 9.6 లక్షలు, కూరగాయలు సరఫరాను టెండర్ ద్వారా వెంకటాద్రి, ప్రింటింగ్ హక్కును నెల్లూరు గణేష్ గ్రాఫిక్స్ దక్కించుకున్నారు. ఇతర వేలం పాటలు వాయిదా పడ్డాయని ఈవో ఉష్షశ్రీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ తుమ్మల వెంకట సురేష్‌బాబు, పూడిపర్తి రామ లింగేశ్వర స్వామి ఆలయ ఈవో ఎన్ శ్రీధర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యంషాపు ఏర్పాటును అడ్డుకున్న మహిళలు


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాశిలి గ్రామంలోని అరుంధతి కాలనీ వద్ద మద్యంషాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మద్యం షాపు ఏర్పాటు పనులను మహిళలు అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఈమేరకు వారు ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎక్సైజ్ సీఐ వెంకట రమణమ్మకు వినతిపత్రం అందజేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత

కావలి, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద రక్తదానం సామాజిక బాధ్యతని జిల్లా ప్రజారవాణా అధికారి మురళీబాబు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం కావలి డిపో గ్యారేజి ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఎక్కువసార్లు రక్తదానం చేసిన సుబ్బారావు, రవికుమార్, శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ ఉద్యోగి కుమారుడు నచికేత్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఎం రాపూరు శ్రీనివాసులు, ఇతర అధికారులు కల్పనా రెడ్డి, ఖాజామొహిద్దీన్, ఎం. రామకృష్ణ, రవి ప్రకాష్, రఘునాథరెడ్డి, చెంచురామయ్య. తదితరులు పాల్గొన్నారు.

రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ మృతి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హసనపురం గ్రామానికి చెందిన రాజవోలు సొసైటీ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి (45) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కార్పొరేట్ ప్రయోజనాలకే కేంద్ర బడ్జెట్


సమావేశంలో మాట్లాడుతున్న వామపక్షాల నేతలు

కావలి,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం కలిగించేలా కేంద్ర బడ్జెట్ ఉందని వామపక్ష పార్టీల నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్షాల నేతల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చేలా ఉందని, బడ్జెట్‌లో ప్రజల కొనుగోలు శక్తి పెంచే ఒక్క పథకం కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేటీకరణ చేసేందుకు బడ్జెట్ అని, అధిక ధరల అదుపుకుకాని, కార్మికవేతనాలు పెంచేందుకుకాని ఉపయోగపడదన్నారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు పసుపులేటి పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, నాగరాజు, లక్ష్మీరెడ్డి, కరువాది భాస్కర్, కృష్ణమోహన్, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరును తిరిగి 'ప్రకాశం'లో కలపాలి

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కోరారు. బుధవారం సాయంత్రం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 15న సీఎం చంద్రబాబునాయుడు కందుకూరు వస్తున్న సందర్భంగా ఈమేరకు ఆయనకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు వినతిపత్రం అందజేయనున్నామని తెలిపారు. అలాగే కందుకూరు మండల కార్యాలయాల ఆవరణలో ఐఓసీ పెట్రోలుబంకు ఏర్పాటు నిర్ణయాన్ని రద్దుచేసేలా చర్యలు తీసుకోవాలని, పెట్రోలుబంకు ఏర్పాటు జరిగితే ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని వివరిస్తూ ఓ వినతిపత్రం అందచేస్తామన్నారు. రాళ్లపాడు అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సీఎంకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు తోకల వెంకటేశ్వర్లు, పాలేటి కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, పిన్నంరాజు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జీ.అయ్య వారిపల్లి పంచాయతీ దేకూరుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ క్రియాశీలక సభ్యుడు పెరుమాళ్ల రమణయ్య బుధ వారం అనారోగ్యంతో మృతిచెందడంతో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరంగరావు నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకుడు ముడమాల రమేష్‌రెడ్డి అందజేసిన రూ.10 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నెల్లూరు వెంకటస్వామినాయుడు, మేకపాటి మాల్యాద్రినాయుడు, ఆవుల రోశయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి....

సంగం, ఫిబ్రవరి 12: అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం కాగా బాధిత మహిళ నెల్లూరు రమణమ్మకు ఆత్మకూరు జనసేన పార్టీ నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందచేశారు. ఆత్మకూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, చిరంజీవి యువత అధ్యక్షుడు భానుకిరణ్, సీనియర్ నాయకులు చదలవాడ హరీష్, మావిళ్ల హరికృష్ణ తమ సొంత నిధులు రూ. 12వేల నగదు, నెలకు సరిపడా బియ్యం, నిత్యవసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మందికి ఉద్యోగాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయమెంట్ ఆఫీస్, సీడప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అరిస్ ఆగ్రో లిమిటెడ్, వీల్ ఇండియా లిమిటెడ్, అమర్‌రాజా బ్యాటరీస్. గ్రీన్‌టెక్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూకు 56 మంది అభ్యర్థులు హాజరుకాగా 26 మందిని ఎంపిక చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూమ్, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఆర్ డిగ్రీ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

పట్టణంలోని ఏఎస్ఆర్ డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో బుధవారం ఎమ్ఎస్‌సీ, మహేంద్ర టెక్ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలను కైవసం చేసుకున్నారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ యం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ ఎ శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్ డి ప్రసాద్, ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాసులరెడ్డి, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

జేవీవీ కృషి అభినందనీయం

కావలిటౌన్, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుటకు జేవీవీ చేస్తున్న అభినందనీయమని డాక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం జేవీవీ కార్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. కావలి శాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలను పారదోలేందుకు, సైంటిఫిక్ టెంపర్‌ను పెంపొందించేందుకు జేవీవీ ఉద్యమరూపంలో ముందుకు పోవడం గొప్పవిషయమన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, సభ్యులు హరనాథ్, ఆకుల రమణయ్య, సుబ్బరాయశర్మ, కల్యాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జలవనరుల గణనపై శిక్షణ

అనంతసాగరం ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం చిన్నతరహా నీటి వనరుల గణనపై వీఆర్వో, వీఆర్ఏలకు మండల అధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామంలో భూగర్భ వనరులు చెరువులు, కుంటలు, బోర్లు, బోరుబావులకు సంబంధించి వివరాలు సేకరించే విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం సమాచారాన్ని జియోట్యాగింగ్ చేయబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభాషిణి, ఏఎస్‌వో మోహన్, ఇరిగేషన్ ఏఈ లీలాకుమారి పాల్గొన్నారు.

సిమెంట్‌రోడ్డు పనుల ప్రారంభం

ఉదయగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలాజీనగర్‌లో బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ రియాజ్ ప్రారంభించారు. రూ.5 లక్షల ఉపాధి హామీ నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరాజు, గుత్తేదారు మజీద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అక్షరాస్యులు కావాలి

లింగసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అక్షర వెలుగు కేంద్రాల ద్వారా మహిళలందరూ అక్షరాస్యులుగా మారాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం కె సింహాద్రిరావు అధ్యక్షతన బుధవారం ఉల్లాస్ అక్షర వెలుగు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, ఉపాధి పనులకు వెళ్లే మహిళలందరూ మస్టర్లలో వేలిముద్రలకు బదులు సంతకాలు చేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్ బాషా, సీసీలు నారాయణమ్మ, మాధవ, మాధవరావు, అర్చన పాల్గొన్నారు.

ఖాళీ చేయనందుకు పోస్టాఫీసుకు తాళం

అల్లూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఖాళీ చేయమని ఎన్నిసార్లు చెప్పినా, వినిపించుకోక పోవడంతో ఇంటి యజమాని పోస్టాఫీసుకు తాళం వేశారు.ఈ సంఘటన అల్లూరు తూర్పువీధిలో బుధవారం చోటు చేసుకుంది. పోస్టాఫీసు శాశ్వత భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పదేళ్లుగా తూర్పువీధిలోని ఓ ఇంటిలో తాత్కాలికంగా దాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని ఖాళీ చేయమని ఇంటి యజమాని పలుమార్లు కోరినా ఖాళీ చేయకపోవడంతో బుధవారం గేటుకు తాళం వేశాడు. దీంతో అధికారులు ఫోన్ చేసినా యజమాని స్పందించకపోవడంతో సిబ్బంది వెనుతిరిగారు.

చిత్తలూరు పీహెచ్‌సీ తనిఖీ

చేజర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్తలూరు గ్రామంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని బుధవారం ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎస్కే ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బంది పని తీరును వెద్యశాలకు వస్తున్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో అందిస్తున్న వివిధ రకాల వెద్య పరీక్షలకు వస్తున్న వారి వివరాలను పరిశీలించారు. అదేవిధంగా చిత్తలూరు గ్రామంలోని టిబి పేషంట్ ఇంటి వద్దకు వెళ్ళి ఆరోగ్యంపై అరాతీశారు. అనంతరం ఆదురుపల్లిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు పిఎచ్‌సి వెద్యాధికారి డా. నవీన్ కుమార్, డిస్ట్రిక్ ప్రోగాం కోఆర్డినేటర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని ఎస్టీ కాలనీ వాసులకు బుధవారం క్యాన్సర్, బాల్య వివాహాలపై గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి శివకల్పన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె రొమ్ము, నోటి, గర్భాశయ, ముఖద్వార క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాది సందిరెడ్డి రామారావు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ట్యాంకుల శుభ్రం

లింగసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని మంచి నీటి ట్యాంకులను బుధవారం అధికారులు శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేశారు. పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం, లింగ సముద్రం, జంగంరెడ్డిపాలెంలోని నీటి ట్యాంకులను పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు, రాళ్లపాడు-రోళ్లపాడు నీటి పథకం సిబ్బంది ద్వారా శుభ్రం చేయించారు. నెల క్రితం ఈ ట్యాంకులను కడిగించామని పంచాయతీ కార్యదర్శి చెప్పారు.

శేషగిరిరావుకు ఘన సన్మానం

కొండాపురం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): కొమ్మి గ్రామంలో వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొందిన వై.ఎస్ శేషగిరిరావును పంచాయతీలోని రామానుజపురం రైతులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు, గుమ్మా శ్రీనివాసులు, బెల్లం నరసింహరావు, ఎర్రయ్య, మాల్యాద్రి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

15 వరకు దరఖాస్తు గడువు పెంపు

వింజమూరు : బీసీ, ఈబీసీ, కాపు, రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్లకు దరఖాస్తు గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.